

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## హత్యాయత్నం కేసులో ముగ్గురు అరెస్టు

**జవహర్‌నగర్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులను జవహర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి దాడికి ఉపయోగించిన ఇనుపరాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను ఏసీపీ చక్రపాణి ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. యాప్రాల్‌కు చెందిన ఎం. సుధీర్ కుమార్ (28)కు గతంలో ఉన్న వివాదాల నేపథ్యంలో సందీప్ కుమార్ అలియాస్ కుట్టస్‌తో గొడవ జరిగింది. ఈ నెల 6న సుధీర్ తన సోదరుడు దీపక్‌తో కలిసి యాప్రాల్‌లోని ఆదిత్య వైన్స్ వద్ద ఉన్న సమయంలో సందీప్ స్నేహితులైన ఎస్. వివేక్, సుమిత్ రాఘవన్ అక్కడికి వెళ్లారు.

సుధీర్ అక్కడ ఉన్న విషయాన్ని వారు సందీప్‌కు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. దీంతో సందీప్ కుమార్ అలియాస్ కుట్టస్ ఇనుపరాడ్‌తో అక్కడికి చేరుకుని సుధీర్ తలపై పలుమార్లు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు పోలీసులు పేర్కొన్నారు. మిగతా ఇద్దరు నిందితులు కూడా దాడికి సహకరించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ ఘటనపై నేరం నంబర్ 1127/2026 కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఈ నెల 6, 7 తేదీల మధ్య రాత్రి యాప్రాల్ ఎక్స్‌రోడ్స్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

వారి సమాచారంతో సంఘటన స్థలానికి సమీపంలో సుమారు 30 అంగుళాల పొడవైన ఇనుపరాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీసీటీవీ ఫుటేజీని కూడా సేకరించారు. నిందితుల్లో సందీప్ కుమార్ అలియాస్ కుట్టస్ (27) డ్రైవర్‌గా, ఎస్. వివేక్ (38) వెల్డింగ్ వ్యాపారిగా, సుమిత్ రాఘవన్ (26) టాటూ వ్యాపారిగా ఉన్నారు. వీరంతా యాప్రాల్, అల్వాల్ ప్రాంతానికి చెందినవారని పోలీసులు తెలిపారు. ఈ అరెస్టు జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సైదులు, ఎస్ఐ బి. రాము నాయక్, సిబ్బంది ఆధ్వర్యంలో, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జరిగింది. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## హోదాను వదిలి పోతురాజులతో కదంతొక్కి..

### భువనేశ్వరి మాతకు సంప్రదాయ నృత్యంతో అదనపు కలెక్టర్ల నీరాజనం

### కలెక్టరేట్‌లో వైభవంగా సాగిన బోనాల ఉత్సవం



వీరగోల పట్టి చిందేస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7, ప్రభాతవార్త:** నిరంతరం అధికారిక సమావేశాలు, సమీక్షలు, ప్రభుత్వ పథకాల అమలు, సిబ్బంది పనితీరు పరిశీలనలతో ఉదయం నుంచి రాత్రి వరకు నిమిషం తీరిక లేకుండా గడిపే ఉన్నతాధికారులు.. అకస్మాతుగా జనంతో మమేకమై పండుగ సంబరాల్లో ఓలలాడితే ఆ ఆనందానికి అవధులు ఉంటాయా? సరిగ్గా మేడ్చల్ కలెక్టరేట్‌లో అదే అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు నిలువుటద్దమైన ఆషాడ మాస బోనాల పండుగను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డిల పర్యవేక్షణ, నాయకత్వంలో నిర్వహించిన ఈ వేడుకలు కలెక్టరేట్‌కు కొత్త కళను తీసుకొచ్చాయి. రోజూ పరిపాలనా వ్యవహారాలతో బిజీగా ఉండే అదనపు కలెక్టర్లు, స్వయంగా ముందుండి ఈ ఆధ్యాత్మిక మహోత్సవాన్ని నడిపించడమే కాకుండా, సిబ్బందితో కలిసి వేడుకల్లో పాల్గొని అందరిలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. మార్మోగిన డప్పు చప్పుళ్లు, పోతరాజుల గజ్జెల సవ్వడులు, శివసత్తుల పూనకాల నడుమ కలెక్టరేట్ ప్రాంగణమంతా భక్తి పారవశ్యంతో పులకించిపోయింది. ప్రాంగణంలోని శ్రీ భువనేశ్వరి మాత ఆలయం వద్దకు ఉద్యోగులు, మహిళా సిబ్బంది భక్తిశ్రద్ధలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆ సమయాన అధికారులు, సిబ్బంది తమ హోదాలను పక్కనబెట్టి, డప్పు వాయిద్యాలకు అనుగుణంగా అడుగులు వేస్తూ, సంప్రదాయ నృత్యాలతో అమ్మవారికి నీరాజనాలు అర్పించారు. మహిళా అధికారులు, సిబ్బంది కలసికట్టుగా అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదనపు కలెక్టర్ల చొరవతో కలెక్టరేట్ సిబ్బందితో పాటు నాయకులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళలు ప్రతి ఒక్కరూ ఒకే కుటుంబంలా కలిసిపోయి ఈ బోనాల జాతరను అంబరాన్నంటేలా విజయవంతం చేశారు. అధికారం వెనుక ఉన్న ఆత్మీయతను, ఆధ్యాత్మిక నిబద్ధతను చాటుతూ అదనపు కలెక్టర్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ బోనాల సంబరం తమ మనస్సులలో చిరస్థాయిగా నిలిచిపోతుందని స్థానికుల, ఉద్యోగులు పేర్కొన్నారు.



పోతురాజులతో కలిసి పాల్గొన్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి







ఇబ్రహీంపట్నం ఎంపిడివో కార్యాలయంలో అర్ధనగ్నంగా ఆందోళన చేస్తున్న దండుమైలారం సర్పంచ్ సురేష్

### మహిళా ఎంపిడివో ఎదుట చొక్కా విప్పేసి

## సర్పంచ్ హాల్‌చల్

- ◆దండుమైలారంలో గ్రామకంఠం భూమి కోసం కార్యాకర్తలతో మండల కార్యాలయం ముట్టడి
- ◆స్పందించకపోతే 60 గజాలు చొప్పున పంచుకుంటామని వార్నింగ్
- ◆అధికారి ఛాంబర్‌లోకి చొరబడి వీరంగం
- ◆కార్యకర్తల హడావుడితో ఫర్నిచర్ ధ్వంసం
- ◆పగిలిన అద్దంతో రెచ్చిపోయిన అనుచరులు
- ◆అదుపు చేసేందుకు ప్రయత్నించిన సిఐకి గాయాలు
- ◆ఎంపిడివో ఫిర్యాదుతో కేసు నమోదు

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. దండుమైలారంలోని గ్రామకంఠం భూమిని పేదలకు కేటాయించాలనే డిమాండ్‌తో స్థానిక సర్పంచ్ నరేష్ నాయకత్వంలో గ్రామస్తులు ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన నిర్వహించారు. ఆందోళన దారి తప్పింది. ఎంపీడీవో ఛాంబర్‌ని ముట్టడించారు. టేబుల్‌పై ఉన్న గ్లాసు ధ్వంసం చేశారు. భూ వ్యవహారం పై అధికారులకు లేఖ రాయాలని పట్టుబట్టారు. లేకుంటే 60 గజాలు చొప్పున పంచుకుంటామని హెచ్చరించారు. పోలీసులు జోక్యం చేసుకొని సరి కాదని చెప్పే ప్రయత్నం చేశారు. దాంతో సర్పంచ్ ఒక్కసారిగా రెచ్చిపోయారు. ఆయన వెనకాల ఉన్న పార్టీ కార్యకర్త టేబుల్ పై ఒక్కసారిగా బాదడంతో గ్లాసు పగిలిపోయింది. సర్పంచ్ తన షర్టు విప్పేసి హల్చల్ చేశారు. పగిలిన అద్దాల పెచ్చులతో హల్చల్ చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ తోపులాటలో ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి, సర్పంచ్ నరేష్ కు గాయాలయ్యాయి. సర్పంచ్ అక్కడే సోమసిల్లి పడిపోవడంతో ఆయనను ఆసుపత్రికి తరలించారు. >>2

## గోల్డ్ షాపులో కిలేడీలు

### యజమానిని మాటల్లో పెట్టి హస్తలాఘవం

### 10గ్రాముల బంగారు నెక్లెస్‌తో జంప్

### ఆభరణం మిస్సింగ్‌తో బయటపడిన చోరీ ఉదంతం

### సిసి పుటేజి ఆధారంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**తాండూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త :** బంగారం కొనుగోలు చేస్తున్నట్లు నమ్మించిన కిలేడీలు బంగారం దుకాణంలో ఆభరణాల చోరీకి పాల్పడ్డారు. షాపులోని షోకేజ్‌లో విక్రయించేందకు ఉంచిన బంగారు నెక్లెస్‌ను అపహరించి అక్కడి నుండి ఉడాయించారు. ఈ సంఘటన తాండూరు పట్టణం గాంధీచౌక్ సమీపంలోని గంజిపల్లి సాయి జువెలరీ షాప్‌లో చోటుచేసుకుంది. చోరీ చేసిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఇందుకు సంబందించి పట్టణ సీఐ పరమేశ్వర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని గాంధీచౌక్ సమీపంలోని గంజిపల్లి సాయి జువెలరీ షాపులోకి శుక్రవారం సాయంత్రం ముగ్గురు మహిళలతో పాటు ఓ వ్యక్తి బంగారు ఆభరణాలు కొనుగోలు చేయాలంటూ వచ్చారు. నగలు చూపించాలంటూ యజమానిని మాటల్లో పెట్టారు. ఇదే సమయంలో చాకచక్యాన్ని ఉపయోగించి 10గ్రాముల బంగారు నెక్లెస్‌ను అపహరించి అక్కడి నుంచి జారుకున్నారు. కొద్ది సేపటికి నెక్లెస్ కనిపించకపోవడంతో యజమాని షాపులోని సీసీ పుటేజ్‌ను పరిశీలించగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ పుటేజీ దృశ్యాలను స్వాదీనం చేసుకొని నిందితుల కోసం దర్యాప్తు చేపట్టారు.



సర్పంచ్‌ల ప్రశ్నలకు వివరణ ఇస్తున్న స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి

## ఫోన్ చేస్తే పలకరు.. పనులు చేయరు!

♦ప్రజాప్రతినిధుల ఫిర్యాదులకూ స్పందిచటంలేదు ♦శాఖల అధికారుల నుంచి సమాచారం సున్న ♦సత్తర్‌కుంట తండాలో అంగన్‌వాడీ సిబ్బంది అలక్ష్యం ♦చిన్నారులకు అందని పౌష్టికాహారం ♦తరచూ టీచర్ విధులకు గైర్హాజర్ ♦లింగంపల్లి-దుద్యాల్ రహదారి నిర్మాణంలో జాప్యం ♦మండల సమావేశంలో సర్పంచ్‌ల ధ్వజం

**దుద్యాల్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** మండలంలో అభివృద్ధి పనుల జాప్యం, ప్రభుత్వ పథకాల అమలులో లోపాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల నిరక్ష్యంపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశం అధికారులపై ప్రశ్నల వర్షంతో వేడెక్కింది. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించగా, >>2

## పంద్రాగస్టుకు సిద్ధం కండి

### స్టాళ్ల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనపై కలెక్టర్ దిశానిర్దేశం

### వర్షం కురిసినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ఆదేశం

**వికారాబాద్,ప్రభాతవార్త :** ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్ల చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరెట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరేడ్ గ్రౌండ్‌లో టెంట్ల ఏర్పాటు, వీఐపీ సీటింగ్, ప్రధాన వేదిక ఏర్పాటు, అధికారులు, ప్రజాప్రతినిధుల సీటింగ్ ఏర్పాటు, పరేడ్ నిర్వహణ విధానం, కార్యక్రమాల ప్రారంభ క్రమం , వివిధ శాఖల స్టాళ్ల ఏర్పాటు, విద్యుత్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గత ఏడాది చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్, అవసరమైన చోట మార్పులు చేసి ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వర్షం కురిసే అవకాశం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కూడిన ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వివిధ శాఖలలో పెండింగ్ ఉన్న సిఎం ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం జీఓఎంఎస్ నెంబర్ 4 విడుదల చేసిందని, ఈ జిఓ ద్వారా మండల స్థాయి ప్రజావాణి నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి మండలంలో మండల ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, అటవీ శాఖ అధికారి విశాల్ బత్తుల, డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఎ ఓ ఫర్హీన బేగం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**ఈవీఎం గోడౌన్ తనిఖీ**

జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను రాష్ట్ర అడిషనల్ సీఈఓ వాసం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఈవీ ఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను కుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమములో ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకటచారి, డీఆర్ఓ స్వర్ణ లత, ఆర్డీఓ వాసు చంద్ర, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హాలీ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం గోడౌన్ తనిఖీకి వచ్చిన రాష్ట్ర అడిషనల్ సీఈఓ వెంకటేశ్వర్లు





ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు నిర్మాణాలు సాగుతున్న దృశ్యం

### కలెక్టర్ హెచ్చరించినా..

## డోంట్ కేర్!..

★మాడ్గుల తహసీల్దార్ ఆఫీస్ ఎదుటే 175 గజాల ప్రభుత్వ భూమి కబ్జా ★యథేచ్ఛగా ఇంటి నిర్మాణం ★ప్రేక్షక పాత్రలో స్థానిక అధికారులు ★పరాకాష్టకు చేరిన యంత్రాంగం నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

**మాడ్గుల, ఆగస్టు 7, ప్రభాతవార్త:** మాడ్గుల మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణపై అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమ వుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఆదేశించినా అక్రమ నిర్మాణాన్ని నిలిపి వేయడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపి స్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయం ఎదుటే ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం సాగుతుండటం అధికారుల నిరక్ష్యానికి పరాకాష్టగా మారిందని స్థానికులు మండిపడుతున్నారు.

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా సర్వే నంబర్ 543లోని ప్లాట్ నంబర్ 53లో 175 చదరపు గజాల ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలంలో ఓ వ్యక్తి గత రెండేళ్లుగా అక్రమంగా ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణం జరుగుతున్న విషయాన్ని తహసీల్దార్ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని వారు చెబుతున్నారు.

అక్రమ నిర్మాణంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు లేకపోవడంతో చివరకు ఈ వ్యవహారాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన కలెక్టర్, ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న నిర్మాణంపై విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని తహసీల్దార్‌ను ఆదేశించినట్లు సమాచారం.

కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు సదరు స్థలం తహసీల్దార్ కార్యాలయ పరిధిలో ఉందని, ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టరాదని హెచ్చరిస్తూ అక్కడ ఎమ్మార్వో బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో అక్రమ నిర్మాణానికి అడ్డుకట్ట పడుతుందని స్థానికులు భావించారు.

అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును సైతం సదరు వ్యక్తి కొద్ది రోజులకే తొలగించి, నిర్మాణ పనులను మళ్లీ యథేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపట్టవద్దని అధికారులు స్పష్టంగా హెచ్చరించినప్పటికీ, ఆ ఆదేశాలను లెక్కచేయకుండా పనులు కొనసాగించడం అధికార యంత్రాంగంపై ఉన్న భయమే లేకపోవడానికి నిదర్శనమని స్థానికులు అంటున్నారు.

మరోవైపు, బోర్డు తొలగించిన విషయం అధికారులకు తెలిసినా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కలెక్టర్ ఆదేశాలు, తహసీల్దార్ హెచ్చరికలు, అధికారిక బోర్డు.. ఏదీ అక్రమ నిర్మాణాన్ని ఆపలేకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



2లో ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు

## చికిత్స పొందుతూ ఏఆర్ కానిస్టేబుల్ మృతి

### వైద్యం వికటించడం వల్లే ఇంత దారుణం జరిగిందని బంధువుల ధర్నా

## ఆసరాగా ఉంటారని నమ్మితే నట్టేట ముంచారు

### ఎనిమిది ఎకరాల భూమిని అక్రమంగా కాజేశారని వృద్ధురాలి ఆవేదన - గ్రామస్తులతో కలిసి ధర్నా

**తలకొండపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త :** తనకు ఆసరాగా ఉంటారని నమ్మి.. యావదాస్తిని గిఫ్టు డీడ్ ఇచ్చి చివరికి మోస పోయిన ఓ వృద్ధురాలి ఉందంతమింది. వివరాలలోకి వెళితే.. తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన ఆయిల్ బుజ్జమ్మ కుమార్తె కలమ్మ గత కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురై మృతి చెందింది. కలమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వారి బాబోగులను బుజ్జమ్మ చూసుకుంది. వృద్ధాప్యంలో తనకు తోడుగా అన్ని రకాల ఆదుకుంటారని నమ్మి తన పేరున వెల్జాల్ గ్రామంలో సర్వేనెంబర్ 54లో ఉన్న 8 ఎకరాల పట్టా భూమిని చిన్న కుమార్తె నాగమణి మనవరాలు పద్మ రజిత, మనవళ్లు శేఖర్ రవి, ఇలా పేరున తనకున్న ఆస్తిని గిఫ్ట్ డీడ్ ద్వారా రాసిచ్చింది. ఇదే అదునుగా భావించిన రవి, భార్య సునీత వృద్ధురాలికి తెలియకుండానే ఎనిమిది ఎకరాల పట్టా భూమిని తన పేరున మార్చుకున్నారు. మనువలు, మనవరాలకు దక్కాల్సిన భూమిని సునీత ఒక్కతే కాజేయడంతో వృద్ధురాలు లబోదిబో అంటూ శుక్రవారం నాడు గ్రామస్తులతో కలిసి రోడ్డెక్కింది. ఎనిమిది ఎకరాల్లో ఇప్పటికే కొంత భూమిని ఇతరులకు విక్రయించి, మిగిలిన భూమిని కూడా విక్రయించేందుకు ప్రయత్నం చేస్తు తనను మోసగించిందని కన్నీరు మున్నీరైంది. తన కుమార్తె నాగమణి మనవరాలు పద్మ రజితలకు సమాన భాగస్వామ్యం కల్పించాలని, తన అనుమతి లేకుండా అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్ విక్రాలపై ఉన్నతాధికారులు చట్టపరమైన సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం నాయకులు గ్రామ పెద్దలు రైతులు బుజ్జమ్మ కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.





## రాంపూర్‌లో ఆషాఢ మాసం బోనాల సందడి

**కోట్ పల్లి,ఆగస్టు 7, ప్రభాతవార్త :** కోట్‌పల్లి మండలపరిధిలోని రాంపూర్ గ్రామంలో శుక్రవారం నాడు గ్రామంలోని మహిళలు భక్తి శ్రద్ధలతో గ్రామ దేవతలకు బోనాలతో వెళ్లి నైవేద్యలు సమర్పించారు. గ్రామ సర్పంచ్ ఢాక నీలమ్మ మహేశ్వర్ రెడ్డి, గ్రామ ప్రజలు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని, పడి, పశు సంపద పెరగాలని, పంటలు సమృద్ధిగా పండాలని గ్రామ దేవతలకు సంప్రదాయ పద్ధతిలో బోనాలను సంపర్పించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు

## కద్మూరులో ఘనంగా పోచమ్మ బోనాలు



**పూడూరు,ఆగష్టు 7, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని కద్మూరు గ్రామంలో శుక్రవారం పోచమ్మ బోనాలు ఘనంగా జరిగాయి.

ఈ సందర్భంగా అమ్మవారి చలువతో గ్రామంలో పాడిపంటలతో ప్రతిఒక్కరు చల్లంగ ఉండాలని దీవించారు.డప్పుచప్పుళ్ల మధ్య పోతురాజుల విన్యాసాలు.శివసత్తుల పూనకాలు భక్తులను అలరించాయి.ఈ కార్య క్రమంలో వివిధ పార్టీల నాయకులు,గ్రామపెద్దలు తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## కురువగూడలో బోనాలు

**షాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కురువగూడ గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలను కన్నుల పండుగగా నిర్వహించారు ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను అలంకరించు కొని అమ్మవారి ఆలయం వరకు భారీ ర్యాలీగా బయలుదేరారు డప్పు వాయిదాలు పోతురాజుల విన్యాసాల మధ్య సాగిన ర్యాలీలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

## భక్తి పారవశ్యంలో కొత్తూరు

**కొత్తూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త:** కొత్తూరు మున్సిపాలిటీలో శుక్ర వారం గ్రామదేవతలైన ఎల్లమ్మ, మైసమ్మ అమ్మవార్ల బోనాల పండుగను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించగా, మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం నిర్వహించిన బోనాల ఊరేగింపు కన్నులపండువగా



బోనాల వేడుకల్లో పాల్గొన్న నాయకులు,యువకులు ,పోతురాజులు

సాగింది. డప్పుల దరువులు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో పాటు యువత ఫలహార బండి తొట్టెలతో ఉత్సాహంగా పాల్గొని నృత్యాల తో సందడి చేశారు. స్థానిక మాజీ కౌన్సిలర్ హేమ దేవేందర్ ముదిరాజ్ పర్యవేక్షణలో పోతురాజుల విన్యాసాలతో అమ్మవారికి పలహార బండి భారీ ఊరేగింపుగా మొక్కులు చెల్లించారు. గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని గ్రామ పెద్దలు అమ్మవార్లను ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య దేవేందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జే సుదర్శన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్ ముదిరాజ్, మాదారం నరసింహ గౌడ్, బ్యాగరి యాదయ్య, జె కృష్ణయ్య, ఇందూరి శ్రీనివాస్, నవీన్ చారి, సుమన్, టి శ్రీనివాస్ రెడ్డి, బండి కృష్ణ, శివ కుమార్, యం శ్రీనివాస్, క్యాస నవీన్, వి రఘ ముదిరాజ్, యం శివ, యం హరీష్, శివ సాయి, మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బోనాల ఉత్సవాల్లో మహిళలు

## ఘనంగా పోచమ్మదేవత బోనాలు

**కొడంగల్,అగష్టు 7ప్రభాతవార్త:**

అషాడమాసంలో గ్రామదేవతలబోనాల ఉత్సవాలు ఘనంగా కొనసాగు తున్నాయి.శుక్రవారం కొడంగల్ పట్టణంలోని సన్‌సిటీ కాలనీలో గాలి పోచమ్మ దేవత బోనాలు ఘనంగా నిర్వహించారు.కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు తలపై పెట్టుకొని ఊరేగింపుగా గ్రామదేవత ఆలయానికి చేరుకున్నారు.అనంతరం గ్రామదేవత ఆలయం చుట్టూ ప్రదక్షిణలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.వర్షాకాలం సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తు పంటల బాగా పండి పిల్లపాలను సుఖసంతోషాలతో ఉండేలా చల్లగా ఆశీర్వదించాలని వేడుకున్నారు.

**అప్పాయిపల్లిలో రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు**

మండల పరిధిలోని అప్పాయిపల్లిలో వెలిసిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవత జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.శుక్రవారం శ్రీరేణుక ఎల్లమ్మకు గ్రామస్తులు మహిళలు భారీ సంఖ్యలో బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మకు కానుకలు సమర్పించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొడ్రాయి వెంకటయ్య,ఉపసర్పంచ్ పకీరప్ప,గ్రామస్థులు గోకుల్‌సింగ్, దత్తుసింగ్,సంగప్ప,కాశయ్యగౌడ్,ప్రసాద్,శేఖర్‌గౌడ్,భగవంతు,రాములు,మల్లేష్‌గౌడ్,నర్సప్ప,పకీరప్ప తదితరులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

**కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల బోనాల ఊరేగింపు ః**

కొడంగల్ పట్టణంలోని కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్ విద్యార్థులు బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.సాంసృ్కతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించి అందరినీ అకట్టుకున్నారు.కార్యక్రమంలో నిర్వహించిన పోతరాజు విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ మక్సూద్,విద్యార్థులు,ఉపాద్యాయులు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## శాకాంబరిమాతగా కళ్యాణకామేశ్వరీదేవి



ఎన్ఎఫ్‌సీనగర్‌లో శాకాంబరిమాత అలంకారంలో కళ్యాణకామేశ్వరీ అమ్మవారు

**ఘట్‌కేసర్, ఆగష్టు 7, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్ రామగిరిపై కొలువైన శ్రీరామకళ్యాణకామేశ్వరీ దేవస్థానంలో శుక్రవారం శాకంబరి ఉత్సవం నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో ప్రకృతి మాత స్వరూపంగా అలంకరించిన అమ్మవారినఇ భక్తులు దర్శించుకున్నారు. ఆషాఢమాసం చివరి శుక్రవారం సందర్భంగా ఆలయంలో నిర్వహించిన శాకంబరి పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. ఘట్‌కేసర్ డిప్యూటి కమిషనర్ అల్లూరి వాణి, ఆలయ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బొక్క సంగీతలు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త శివప్రసాద్, అర్చకులు శివకుమార్, కెవిఎల్‌జి.ప్రసాద్‌ల ఆధ్వర్యంలో శాకాంబరి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. కళ్యాణ కామేశ్వరీ అమ్మవారు నవశక్తి రూపాలలో వివిధ రకాల కూరగాయలతో శాకంబరీగా భక్తులకు దర్శనమిచ్చారు. శాకంబరీ దేవి సృష్టి పోషణకు, వృక్షసంపదకు అధిష్టాన దేవతని ఆమెను ఆదిపరాశక్తి అయిన దుర్గాదేవి అవతారంగా భావిస్తారని, లోకంలో కరువు కాటకాలను రూపుమాపి, సకల జీవులకు ఆహారాన్ని, వర్షాలను ప్రసాదించే తల్లిగా ఈమెను భక్తులు కొలుచుకుంటారని వారు పేర్కొన్నారు.

## గ్లోబల్ మోడల్ హైస్కూల్‌లో ఘనంగా బోనాలు

**మోమిన్‌పేట్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను గ్లోబల్ మోడల్ హై స్కూల్‌లో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరితంగా, సాంస్కృతిక వైభవంతో ఘనంగా నిర్వహించారు. పూలు, సాంప్రదాయ అలంకరణలు, పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించే అలంకారాలతో పాఠశాల ప్రాంగణమంతా కళకళలాడుతూ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని తెలంగాణ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించారు. పాఠశాల ఆవరణలో పోచమ్మ అమ్మవారికి అంకితంగా, అందంగా అలంకరించిన చిన్న దేవాలయాన్ని ఏర్పాటు చేయడం వేడుకలను ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బోనం తయారీ, అలంకరణతో కార్యక్రమం ప్రారంభమైంది. అమ్మవారిపై భక్తి, కృతజ్ఞతలకు ప్రతీకగా విద్యార్థులు పూలు, వేపాకులు, పసుపు తదితర సాంప్రదాయ వస్తువులతో బోనాన్ని అందంగా అలంకరించారు. అనంతరం అలంకరించిన బోనాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా చిన్న దేవాలయానికి తీసుకెళ్లారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అందరి ఆరోగ్యం, ఆయురారోగ్యం, సుఖసంతోషాలు, శాంతి, శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు శ్రీమతి సంగీతలక్ష్మీ బోనాల పండుగ చరిత్ర, విశిష్టత, సాంస్కృతిక ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు ఎంతో ఆసక్తికరంగా వివరించారు.

కేరళకు చెందిన యాజమాన్యం అయినప్పటికి, తెలంగాణ సంప్రదాయ పండుగ అయిన బోనాలను అత్యంత గౌరవభావంతో, ఉత్సాహంగా నిర్వహించి ప్రోత్సాహించడం అందరి ప్రశంసలను అందుకుంది. స్థానిక సంస్కృతి, సంప్రదాయల పట్ల వారు చూపిన గౌరవం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజల హృదయాలను గెలుచుకుంది. ఈ కార్యక్రమంలో "భిన్నత్వంలో ఏకత్వం" అనే భారతీయ సంస్కృతి స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, ప్రాంతాలకు అతీతంగా మన దేశ సాంస్కృతిక విలువలను గౌరవించే గొప్ప సందేశాన్ని అందించింది. గ్లోబల్ మోడల్ హై స్కూల్‌లో నిర్వహించిన బోనాల వేడుకలు కేవలం ఒక పండుగ నిర్వహణకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో తెలంగాణ గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి, ఐకమత్యం, సామాజిక విలువల పట్ల గౌరవాన్ని పెంపొందించే అర్థవంతమైన కార్యక్రమంగా నిలిచాయి.

## మూడుచింతలపల్లిలో ఘనంగా బోనాలు

**శామీర్‌పేట, ఆగస్టు 7, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లి గ్రామంలో బోనాల పండుగను ప్రజలు రెండురోజుల పాటు ఘనంగా జరుపుకున్నారు. మూడుచింతలపల్లిలో గ్రామప్రజలు బోనాల పండుగను సాంప్రదాయ బద్ధంగా కన్నుల పండుగగా జరుపుకున్నారు. అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. మహిళలు బోనాలను ఊరేగింపుగా ఆలయాలకు తీసుకవెళ్లి అమ్మవార్లకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ బోనాల పండుగ ఉత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ జాము రవి, కౌన్సిలర్ ఆర్.నీరజ్‌గౌడ్‌లు,పలువురు నాయకులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు అందరు ఆయారాగ్యాలతో సుఖశాంతులతో, సిరిసంపదలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల సందర్భంగా వైన్ షాపులు, బార్లు మూసివేత

**రంగారెడ్డి అర్బన్ ఆగస్టు7,ప్రభాతవార్త :**

బోనాల పండుగ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వైన్ షాపులు, కల్లు దుకాణాలు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లు మూసివేయాలని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి పేర్కొన్నారు.అయితే స్టార్ హోటళ్ళు,క్లబ్‌లలోని బార్లు మినహా అన్ని బంద్ ఉంటాయన్నారు,ఈనెల 9 ఉదయం 10:00 గంటల నుంచి 10వ తేది ఉదయం 6:00 గంటల వరకు మూసివేయాలని పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తెలంగాణ ఎక్సైజ్ చట్టం1968లోని సెక్షన్ 20 ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి బోనాల వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహాయపడాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## చికిత్స పొందుతూ ఎఆర్ కానిస్టేబుల్ మృతి

-ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన..

**వికారాబాద్,ప్రభాతవార్త :** చికిత్స పొందుతూ ఏఆర్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన శుక్రవారం వికారాబాద్ పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామానికి చెందిన నరేష్(32) షాద్‌నగర్‌లో ఏఆర్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని స్వగ్రామమైన ఆలూరుకు వచ్చి, స్నేహితులతో కలిసి నవాబుపేట్ మండలానికి వెళ్ళాడు. అక్కడ నరేష్ కు ఛాతిలో నొప్పి రావడంతో వికారాబాద్‌లోని మెడిక్యూర్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం స్నేహితులు తీసుకు వచ్చారు. ఈ వి షయాన్ని కుటుంబ సభ్యులకు సైతం స్నేహితులు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు మెడిక్యూర్ ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిలో వైద్యులు నరేష్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందించారు. అనంతరం నరేష్ ఆరోగ్య పరిస్థితి బాగుందని, డిశ్చార్జ్ చేస్తున్నట్లు వైద్యులు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంతలోనే నరేష్ ఒక్కసారిగా ఆసుపత్రిలో కుప్పకూలిపోయాడు. వెంటనే అప్రమత్తమైన వైద్యులు మళ్ళీ నరేష్‌ను పరీక్షించగా, నరేష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో వైద్యం వికటించి నరేష్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సైతం పెద్ద ఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న వికారాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. వికారాబాద్ డీఎస్పీ ఆంజయ్య, సీఐ రఘు కుమార్‌లు కుటుంబ సభ్యులకు నచ్చ చెప్పారు. బాధితులకు న్యాయం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని డీఎస్పీ హామి ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుకుమార్ తెలిపారు.

## తల్లి పాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారం

**శామీర్‌పేట, ఆగస్టు 7, ప్రభాతవార్త:** తల్లి పాలు శిశువుకు ప్రకృతి ప్రసాధించిన సంపూర్ణ ఆహారం అని, బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే వెంటనే తల్లి ముర్రు పాలు పట్టాలని, ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వటం తల్లి బాధ్యత అని, తల్లి పాలు శిశువుకు అవసరమైన అన్ని పోషకాలను అందిస్తుందని, రోగనిరోధక శక్తిని పెంపొంది స్తుందని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి పేర్కొన్నారు. తల్లి పాల ప్రాముఖ్యతపై సమాజంలో మరింత అవగాహన కల్పించాలని, చైతన్యం రావటానికి నిరంతరం కృషి చేయాలని ఆమె సూచించారు. శుక్రవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మెడిసిటీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు -2026ను నిర్వహించారు. తల్లి పాల ప్రాము ఖ్యతపై, శిశు సంరక్షణ, మాతృ ఆరోగ్యంపై నిపుణులు అవగాహన కల్పించారు. సమాజం లో తల్లి పాల ప్రాముఖ్యతపై మరింత చైతన్యం తీసుకరావాలని, నిరంతరం అవగాహన కల్పించటానికి కృషి చేయాలని వివరించారు. గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించి ఆమె ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి శిశువుకు ఆరోగ్యవంతమైన భవిషత్‌ను అందించాలని, కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది, సమాజంలోని ప్రతిఒక్కరు తల్లి పాలను ప్రోత్సహించే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడిసిటి నర్సింగ్ కాలేజ్ డైరక్టర్ అకాడమిక్స్ డాక్టర్ సి.మల్లిఖార్జున్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎస్.హైమావతి ప్రిన్సిపల్, డాక్టర్ బ్యూలా జానెట్ వైస్‌ప్రిన్సిపల్, వారితో పాటు పలువురు అదే విధంగా నర్సింగ్ అధ్యాపక బృందం, గర్భిణీలు, బాలింతలు, అంగన్‌వాడి టీచర్లు, ఆశావర్కర్లు, మున్సిపల్ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఎంపిడివో ఎదుట సర్పంచ్ హల్‌చల్

(మొదటి పేజీ తరువాయి)

గ్రామకంఠం భూమి పంపిణీనీ చేయాలని డిమాండ్ చేస్తూ గత 14 రోజులుగా దండుమైలారం గ్రామంలో సర్పంచ్ నాయకత్వంలో పేదలు నిరాహార దీక్షలు చేపట్టారు. అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో శుక్రవారం గ్రామస్తులతో ఎంపీడీవో కార్యా లయంలో గ్రామ సర్పంచ్ నాయకత్వంలో ఆందోళనకు దిగారు. అధికారులు వెంటనే సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. అయితే.. విధులరీత్యా కార్యాల నుంచి బయటకు ఎంపీడీవో వెళుతున్న క్రమంలో ఆమెను అడ్డుకున్నారు. చేసేదిలేక ఎంపీడీవో ప్రమీల తన కార్యాలయంలోకి వచ్చి కూర్చున్నారు. ఒక్కసారిగా ఆమె చాంబర్‌ను చుట్టుముట్టారు. ఉన్నతాధికారులకు లేఖ రాయా లని ఎంపీడీవో ప్రమీలపై సర్పంచ్, స్థానికులు తీవ్ర ఒత్తిడి తెచ్చారు. లేనిపక్షంలో గ్రామకంఠం భూమిని ఆక్రమిస్తామని స్పష్టం చేస్తూ ఎంపీడీవో ఛాంబర్‌లోనే భీష్మించారు.సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి ఆందోళన కారులతో మాట్లాడి శాంతింపజేసే ప్రయత్నం చేశారు. అయితే, ఆందోళనకారులు ఆగ్రహంతో ఎంపీడీవో టేబుల్‌ను బాదడంతో దానిపై ఉన్న అద్దం ధ్వంసమైంది. అనంతరం సర్పంచ్ తన షర్టు తొలగించి నిరసన వ్యక్తం చేయడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఆందోళనకారులను అదుపు చేసే క్రమంలో జరిగిన తోపులాటలో సర్పంచ్ నరేష్ తో పటు సీఐ మహేందర్ రెడ్డికి గాయాలయ్యాయి. ఈ పరిణామాల మధ్య సర్పంచ్ అస్వస్థతకు గురికావడంతో పార్టీ కార్యకర్తలు ఆయనను స్థానిక ఆస్పత్రికి తరలించారు. కాగా తనను బెదిరించి బలవంతంగా లేఖ రాయించారని, ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించారని ఎంపీడీవో ప్రమీల ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఫోన్ చేస్తే పలకరు..పనులు చేయరు

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాల్లో సర్పంచులకు సమాచారం ఇవ్వకుండా సమావేశాలు నిర్వహించడం, ప్రజాప్రతినిధుల ఫోన్‌లకు స్పందించకపోవడం, అభివృద్ధి పనులు నత్తనడకన సాగడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సత్తర్‌కుంట తండా సర్పంచ్ మూడవత్ పూజ బొల్లిబాయి తండా అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, చిన్నారులకు పౌష్టికాహారం సరిగా అందడం లేదని ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి లింగంపల్లి-దుద్యాల్ రహదారి నిర్మాణంలో జాప్యంపై ఆర్అండ్ బి అధికారులను ప్రశ్నించారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు, లూజ్ లైన్ల బిగింపు, ప్రజాప్రతినిధుల ఫిర్యాదులపై స్పందన లేకపోవడంపై సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ ప్రజాప్రతినిధులు లేవనెత్తిన ప్రతి సమస్యను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరిస్తామని, మండల స్థాయిలో సాధ్యం కాని అంశాలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీడీవో జైపాల్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జెన్‌కోలో అకౌంట్స్ అధికారులకు ప్రమోషన్లు

**హైదరాబాద్, ఆగస్టు 7,ప్రభాతవార్త:**

తెలంగాణ జెన్‌కో అకౌంట్స్ విభాగంలో అసిస్టెంట్ అకౌం ట్స్ ఆఫీసర్లు (ఏఏవో) నుంచి అకౌంట్స్ ఆఫీసర్లు (ఏవో) గా పదోన్నతులకు ఆమోదం ఉత్తర్వులు జారీ కావడం పట్ల తెలంగాణ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య హర్షం వ్యక్తం చేశారు. అకౌంట్స్ విభాగంలోని అధికారుల దీర్ఘకాలిక ప్రమోషన్ సమస్యను పరిష్కరించి, పదోన్నతులకు ఆమోదం తెలిపి ఉత్తర్వులు జారీ చేసినందుకు సిఎం రేవంత్‌రెడ్డికి విద్యుత్ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ,ఎనర్జీ శాఖ సెక్రటరీ సి. నవీన్ మిట్టల్ తెలంగాణ జెన్‌కో చైర్మన్ సిఎండీ ఎస్. హరీష్ ,హెచ్‌ఆర్‌డైరెక్టర్ కుమారాజాకి అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ తరపున అంజయ్య హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా శుక్రవారం అసోసి యేషన్ ప్రతినిధులు జెన్‌కో సీఎండీ ఎస్. హరీష్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. అకౌంట్స్ విభాగంలో దీర్ఘకా లంగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్ల సమస్యతో పాటు ఇతర ప్రధానసమస్యల పరిష్కారానికి చొరవ చూపి, సాను కూలంగా స్పందించిన సీఎండీకి అసోసియేషన్ తర పున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదోన్నతుల ఉత్తర్వులు వెలువడటంతో తెలంగాణ జెన్‌కో అకౌంట్స్ విభాగంలోని అధికారులు, ఉద్యోగుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయని పి. అంజ య్య తెలిపారు. ఈ పదోన్నతు లు అధికారుల ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచడంతో పాటు, సంస్థలో వారి పనితీరుకు మరింత ప్రోత్సాహన్ని అందిస్తాయని పేర్కొన్నారు.అకౌంట్స్ విభాగంలోని అధికారులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి భవిష్య త్తులో కూడా ప్రభుత్వం మరియు జెన్‌కో యాజమాన్యం ఇదే విధంగా సహకరించాలని అకౌంట్స్ ఆఫీసర్స్ అసో సియేషన్ తరఫున పి. అంజయ్య కోరారు.

## చెక్కుల పంపిణీలో రసాభాస

**సికింద్రాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని సికింద్రాబాద్ నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాలకు అందజేసే చెక్కుల పంపిణీలో రసాభాస జరిగింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య ప్రోటోకాల్ విషయంలో గొడవ జరిగింది. అధికారికంగా చెక్కులు పంపిణీ చేయాల్సిన సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ కార్యక్రమంలో హాజరు కాకముందే కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు చెక్కులను పంపిణీ చేయడం ప్రారంభిం చారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే హాజరు కాకుండానే చెక్కు లు పంపిణీ చేయడం పట్ల బీఆర్ఎస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని 212 చెక్కులకు గాను రూ. కోటీ 10లక్షల నిధులు విడుదల య్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులు పంపిణీ శుక్రవారం జరగాల్సింది. మధురానగర్ లోని కమ్యూనిటీ హాల్లో పంపిణీకి ఏర్పాట్లు జరిపారు. కాగా కాంగ్రెస్ సికింద్రాబాద్ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌చెక్కులు అందజేయడం ప్రారంభించారు. బీఆర్ఎస్ నేతలు అడ్డుకోడానికి ప్రయత్నించారు. ఈలోగా ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చారు. అప్పటికే అక్కడ చెక్కుల పంపిణీ జరుగు తుండడంతోఅసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు సికింద్రాబాద్లో ఓడిపోయిన అభ్యర్థి ఏకంగా స్టేజిపై ఉండి చెక్కుల పంపిణీ చేయడంలో పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. కాంగ్రెస్ నేతలు రెచ్చగొట్టే ఉద్దేశంతో ఎమ్మెల్యే గోబ్యాక్ అంటూ నినాదాలు చేయడం ప్రారంభించారు. దీంతో బీఆర్ఎస్ నేతలు సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేయడం ప్రారంభించారు. దీంతో ఇదరు వర్గాల నేతల మధ్య తోపులాట జరిగింది. చిలకలగూ పోలీసులు కార్యక్రమం వద్దకు చేరుకుని ఆందోలన చేస్తున్న వారిని బయటకు పంపించారు. కొద్ది సమయం పాటు కార్యక్రమంలో గందరగోళం నెలకొంది. అనంతరం ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్లు కలిసి చెక్కులను పంపిణీ చేశారు. దీంతో కార్యకర్తలు ఆందోళన విరమించారు.చెక్కుల పంపిణీలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ కార్యాక్రమానికి ఆలస్యంగా రావడం వల్ల చెక్కులు పంపిణీ చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఎమ్మెల్యే సకా లంలో హాజరు కాకపోవడం వల్ల వస్తారో, రారో అనే సందేహం వల్ల చెక్కులు అందజేశామన్నారు.




చెంచుపల్లిలో చట్టాలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ(డిఎల్ఎస్ఎ) కార్యదర్శి ఎ.రాధిక తదితరులు

## హక్కులు,బాధ్యత,చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**వికారాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.రాధిక**

**పూడూరు, ఆగష్టు 7, ప్రభాతవార్త :** ప్రజలు తమ హక్కులు,బాధ్యత,చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ(డిఎల్ఎస్ఎ) కార్యదర్శి ఎ రాధిక పేర్కొన్నారు.న్యాయసేవాధికార సంస్థ(డిఎల్ఎస్ఎ) అద్వర్యంలో అంకిత స్వచ్ఛంద సంస్థ సహాకారంతో శుక్రవారం పూడూరు మండలం పరిధిలోని చెంచుపల్లి గ్రామంలో

న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు,మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు,ఎస్సీ,ఎస్టీ,వర్గాలకు జిల్లా న్యాయసేవసంస్థ ద్వారా ఉచిత న్యాయసహాయం అందుబాటులో ఉంటుందని వివరించారు.గృహహింస, బాల్య వివాహాల నిషేదం,మహిళల రక్షణ,బాలల హక్కులు ,సైబర్ నేరాల నివారణ,లోక్ అదాలత్‌ల ద్వారా వివాదాల పరిష్కారం వంటి వాటిపై న్యాయ సేవల సంస్థ అందించే సేవలపై ప్రజలు అవగాహన కలిగి ఉంటాలన్నారు.

చెంచుపల్లి గ్రామంలో ప్రభుత్వ భూముల సమస్య ఉన్నట్లు,తమ దృష్టికి వచ్చిందని ,బాధితులు డిఎల్ఎ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేస్తే సంబంధిత శాఖకు పంపిస్తామని తెలిపారు.ఒకవేళ కేసులో ఉంటేసంబంధిత కేసును ఆన్‌లైన్,యాప్ ద్వారా స్టేటస్ తెలుసుకోవచ్చని సూచించారు. అనంతరం అంకిత సంస్థ అద్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు,మ్యాట్లు,చెప్పులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌రెడ్డి,సర్పంచ్ దయాకర్,చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వెంకటేష్,అంకిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రకాష్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌తో సులభంగా ఎరువుల కొనుగోలు!

**దౌల్తాబాద్,ఆగస్టు 7,ప్రభాతవార్త:**రైతులకు ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం మొదటి విడతలో వికారాబాద్ జిల్లాలో నూతన ఎఫ్ఎఫ్ఎస్ (ఫ్రేమ్‌వర్క్‌ఫర్ ఫెర్టిలైజర్ సేల్) యాప్‌ను అమల్లోకి తెచ్చిందని దౌల్తాబాద్ మండల వ్యవసాయ అధికారిణి జి.తులసి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎఓ జి.తులసి మాట్లాడుతూ...ఫార్మర్ రిజిస్ట్రీ ఆధారంగా పనిచేసే ఈ విధానంలో రైతులు తమ ఆధార్,మొబైల్ నంబర్ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసి భూమి వివరాలు ధృవీకరించు కోవాలని,అనంతరం పంటను ఎంపిక చేసుకొని అవసరమైన ఎరువుల పరిమాణాన్ని నమోదు చేసి,విక్రయ కేంద్రంలో క్యూఆర్ కోడ్ ద్వారా టోకెన్ పొంది ఎరువులు తీసుకోవచ్చని అన్నారు.సాగు విస్తీర్ణానికి తగినట్లుగా ఎరువులు అందే ఈ యాప్‌ను రిటైలర్లు తప్పనిసరిగా వినియోగిం చాలని,కొనుగోలు సమయంలో రైతులు ఆధార్ అనుసంధాన మొబైల్ ద్వారా ఓటీపీ ధృవీకరణ పూర్తిచేయాలని ఈ సందర్భంగా ఆమె రైతులకు సూచించారు.




## సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

**శామీర్‌పేట, ఆగస్టు 7, ప్రభాతవార్త:**ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) రాష్ట్ర స్టీరింగ్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం తూంకుంట, లాల్‌గడిమలక్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, లాల్‌గడిమలక్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యార్జీలు ధరించి నిరసనలు తెలిపారు.

సిపిఎస్ విధానం రద్దు చేసి ఓపిఎస్ విధానంను పునరుద్ధరించాలని, పిఆర్‌సి, 6డిఎలు, పెండింగ్ బకాయిలు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. శామీర్‌పేట మండల టిఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు పి.తిరుమలేశ్ మాట్లాడుతూ రాష్ట్ర యుఎస్‌పిసి కమిటీ పిలుపు మేరకు తూంకుంట, లాల్‌గడిమలక్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధులకు హాజరై నల్ల బ్యార్జీలు ధరించి నిరసనలు తెలుపటం జరిగిందన్నారు.

నాలుగు దశల పోరాటాల్లో భాగంగా శుక్రవారం రోజున నల్ల బ్యార్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపినట్లు వివరించారు. మండలంలోని వివిధ పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు నిరసనలు తెలిపినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే సిపిఎస్ విధానంను రద్దు చేసి ఒపిఎస్ విధానంను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల ప్రధాన కార్యదర్శి కుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘట్‌కేసర్‌లో యువతి అదృశ్యం

**ఘట్‌కేసర్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** సూపర్‌మార్కెట్‌లో పనిచేయడానికి వెళ్లిన ఓయువతీ కనిపించకుండా పోయిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ డివిజన్ బుగ్గానగర్‌లో నివాసముంటున్న రోషిణి అస్తానే (20) ఎదులాబాద్ రోడ్డులోని కృష్ణామార్ట్‌లో గత కొంతకాలంగా ఉద్యోగం చేస్తున్నది. ఈనెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు విధులకు వెళ్లిన రోషిణి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె మొబైల్ నంబర్లకు పలుమార్లు సంప్రదించగా రెండు ఫోన్లు స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో ఆమె పనిచేసే స్థలం, పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితులు తెలిసిన వారి వద్ద గాలించినప్పటికీ ఎలాంటి సమాచారం లభించలేదు.

దీంతో రోషిణి తల్లి అనిత అస్తానే ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మధ్యప్రదేశ్ రాష్ట్రం బాలాఘాట్ జిల్లా లాంజీ మండలం, నింటోలా గ్రామానికి చెందిన రోషిణి బ్రతుకుదెరువు కోసం ఘట్‌కేసర్‌కు వచ్చి కృష్ణామార్ట్‌లో పనిలో చేరింది. రోషిణి అస్తానే (20) సుమారు 5 అడుగులు 3 అంగుళాలు ఎత్తు ఉంటుందని, ఇంటి నుండి వెళ్లిన సమయంలో పింక్ వైట్ రంగు టాప్, పింక్ రంగు ప్యాంట్ ధరించి ఉందని తెలిపారు. మిస్సింగైన యువతి ఆచూకీ ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్, డయల్ 100 / 112కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

ఈమేరకు యువతీ మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపారు.




రాంపల్లిలో మహాంకాళి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సబిత ఇంద్రారెడ్డి

## అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి

**కీసర,ఆగస్టు7,ప్రభాతవార్త:** రాంపల్లి శ్రీమహంకాళీ అమ్మవారి ఆశీసులు ప్రజలందరికి ఉండాలని మాజీమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు.శుక్రవారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని రాంపల్లి శ్రీమహంకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీమహంకాళీ అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఎల్లప్పుడూ ఉండి గ్రామప్రజలు సుఖశాంతులు,ఆయురారోగ్యాలు,ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించాను.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గండి అంజయ్యగౌడ్,మల్లె శ్రీనివాస గౌడ్,నక్క శంకర్‌రెడ్డి,ఏనుగు రామకృష్ణారెడ్డి,వరకాల పెంటయ్యగౌడ్,నల్లోల్ల కుమార్,ఎల్లసాని బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నాగారంలోని నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కౌకుట్ల జీవన్‌రెడ్డి

## నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న జీవన్‌రెడ్డి

**కీసర,ఆగస్టు7,ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ పరిధిలోని శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ అమ్మవారిని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కౌకుట్ల జీవన్‌రెడ్డి దర్శించుకున్నారు.ఆలయ పురోహితులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి మాజీద్ వేణుగోపాల్,ఆలయ ఉపాధ్యక్షులు శ్వేత మల్లారెడ్డి,కోశాధికారి నాగమల్లేశ్వరరావు వాసిరెడ్డి,కమిటీ సభ్యులు మాధవ రావు,రమాదేవి,సలహాదారులు బాబూరావు,ఈస్ట్ హనుమాన్‌నగర్ కాలనీ అధ్యక్షులు ప్రభాకర్,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



పోచారం డివిజన్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు.

## పోచారంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

### ఉప్పల్ జోనల్ కమిషనర్‌కు కాంగ్రెస్ నేతల వినతి

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 7, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాను డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. పోచారం డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, వీధిలైట్లు, డ్రైనేజీ వంటి సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఉప్పల్ జోనల్ కమిషనర్‌ను కలిసిన వారిలో బోడుప్పల్ మాజీ మేయర్ టి. అజయ్ యాదవ్, పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్, మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి తదితరులున్నారు.

## ఉన్నతవిద్యతో బంగారు భవిష్యత్

**మొయినాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త :** ఉన్నత విద్యతో విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉందని విద్యార్థులు క్రమశిక్షణతో నాలుగు సంవత్సరాలు ఇష్టంతో చదివితే మీ జీవితాలు చక్కబడతాయని జనగాం ఎమ్మెల్యే కళాశాల చైర్మన్ పళ్ళ రాజేశ్వర్ రెడ్డి. టిసిఎస్ ట్రాన్స్ ఫర్మేషన్ కోచ్ లింక్ 6 సిగ్మా కన్సల్టెంట్ డాక్టర్ ప్రసాద్ చిట్టి మల్ల లు అన్నారు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని అజిత్ నగర్ చౌరస్తాలో గల విద్య ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్‌లో చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ అంటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పళ్ళ రాజేశ్వర్ రెడ్డితో పాటు టి సి ఎస్ ట్రాన్స్ పర్మిషన్ కోచ్ డాక్టర్ ప్రసాద్ చీటీమల్ల.. ట్రీ లాజి ఇన్నోవేషన్ సీనియర్ హెచ్ఆర్ స్పెషలిస్ట్ అర్చనగైలు పాల్గొని ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు నాలుగు సంవత్సరాల పాటు ఉన్నత విద్యలో క్రమశిక్షణతో ఏ రోజుకు ఆ రోజు విద్యుత్‌తో పాటు ప్రాక్టికల్స్ నిర్వహించినప్పుడే ఉన్నతముగా ఉతీర్ణులై వివిధ కంపెనీలలో మంచి ఉద్యోగ అవకాశాలు సంపాదించుకుంటారని తెలిపారు.

విద్యార్థులకు మా వంతు కృషి ఉన్నప్పటికీని తల్లిదండ్రులు కూడా ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాల్సిన బాధ్యత మీ పైన ఉంటుందని అన్నారు..ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ జి శ్రీలత కళాశాలడ్డీ డాక్టర్ ప్లేస్మెంట్ డైరెక్టర్ వెంకట చలం ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి శిక్ష కౌశల్ సైన్సెస్ విభాగ అధిపతి డాక్టర్ కె లక్ష్మీ మ్నారాయణ ప్రసాద్ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సహారా బాధితులను ఆదుకోవాలి

**ఆమనగల్లు, ఆగస్టు7, ప్రభాతవార్త:** సహారా ఇండియా పరివార్‌లో పొదుపు చేసిన డబ్బులను చెల్లింపులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సహార ఇండియా బాధితులు ప్రతిపక్ష పార్టీ నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవిని కోరారు. సహారా ఇండియా బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నాలుగు రోజులపాటు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహిస్తున్న ఆందోళనలో కల్వకుర్తి ప్రాంత బాధితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అందులో భాగంగానే శుక్రవారం ఎంపీ మల్లురవిని ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కల్వకుర్తి, ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల, మాడ్గుల మండలాల బాధితులు ఎంపీ మల్లు రవిని కలుసుకున్నారు. ఈమేరకు వారు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. సహారా ఇండియా సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో కల్వకుర్తి బ్రాంచ్ మేనేజర్ రేగటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ మల్లురవికి వినతిపత్రం అందజేసిన సహారా బాధితులు

# ఆగస్టు 15 నాటికి ప్రభుత్వ బడులన్నింటికీ యూనిఫామ్‌లు



యూనిఫాంలను అందజేస్తున్న ఎంఇఓ చెన్నయ్య

**ధారూర్, ఆగస్టు 7,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎడ్యుకేషన్ కిట్లపంపిణీలో భాగంగా ధారూర్ మండలంలోని కుక్కింద ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్కూల్ యూనిఫామ్‌లను అందజేశారు. మండల విద్యాధికారి ఎం. చెన్నయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు ఈకిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఇఓ చెన్నయ్య మాట్లాడుతూ, విద్యార్థులకు ఇప్పటికే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, అభ్యాస దీపికలు, ఒక జత బూట్లతో పాటు తాజాగా యూనిఫామ్, టై, బెల్ట్ కూడా అందజేయడం జరిగిందని తెలిపారు.డ్వాక్రా మహిళల ద్వారా ప్రత్యేకంగా కుట్టిస్తున్న ఈ యూనిఫామ్‌లన్నింటినీ రాబోయే ఆగస్టు 15వ తేదీ జెండా పండుగ నాటికి మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు వంద శాతం అందజేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను, కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, బాగా చదువుకుని సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కుక్కింద కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కడియాల వెంకట చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో బస్సుకు హాజరు కావాలని సూచించారు.ఉపాధ్యాయులు బోధించే అంశాలను శ్రద్ధగా అర్థం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింలు, ఇతర ఉపాధ్యాయులు, సీఆర్పీ, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం గౌడ్‌ను , కుమార్ గౌడ్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ

**కేశంపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త:**

కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కుమార్ గౌడ్ ఆకస్మికంగా అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మండల బి ఆర్ ఎస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఎమ్మెల్సీతో పాటు సర్పంచులు నాగిళ్ళ వెంకట్, స్వప్న భూపాల్ రెడ్డి,లేమామిడి వెంకట్ నారాయణ్ రెడ్డి,మాజీ సర్పంచులు తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,బాల్ రాజ్ గౌడ్,యారం శేఖర్ రెడ్డి,నాయకులు సుదర్శన్ కేశంపేట మురళి,శశి,శేఖర్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట మండల పరిధిలోని లేమామిడి మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కేశంపేట మండలానికి చెందిన బిఆర్ఎస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఈ పరామర్శ సమయంలో సర్పంచులు నాగిళ్ళ వెంకట్, స్వప్న భూపాల్ రెడ్డి,లేమామిడి వెంకట్ నారాయణ్ రెడ్డి,మాజీ సర్పంచులు తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,బాల్ రాజ్ గౌడ్,యారం శేఖర్ రెడ్డి,నాయకులు సుదర్శన్ కేశంపేట మురళి,శశి,శేఖర్ లేమామిడి యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

**కేశంపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన దావీద్ శుక్రవారం ఆకస్మికంగా మరణించారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ అంత్యక్రియల నిమిత్తం రూ .5 వేలు ఆర్థిక సహాయాన్ని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుల ద్వారా అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ముత్యాలు, కావలి బాబు, డానియల్, విజయ్ కుమార్, నరసింహ, బోడ మల్లేష్, ఆశీర్వాదం, కావలి మహేష్, రాజు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

## జైల్ భరోని విజయవంతం చేయాలి

**కేశంపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త :** ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ కేశంపేట మండల కమిటీ పిలుపునిచ్చింది. శుక్రవారం కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో సీఐటీయూ మండల కన్వీనర్ భేరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, మధ్యాహ్న భోజన కార్మికుల సమక్షంలో కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా భేరి శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా జైల్ భరో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.ఆగస్టు 10న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే జైల్ భరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి గూడ సర్పంచ్ శశిరేఖ యాదయ్య, నర్సింలు సత్యం గౌడ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.





రాంపల్లి కేజీఆర్ కళాశాలలో ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని విద్యార్థులతో సంతకాలు సేకరిస్తున్న మాజీ చైర్మన్ చంద్రారెడ్డి

## విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

**కీసర,ఆగస్టు7,ప్రభాతవార్త:** విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి డిమాండ్ చేశారు.శుక్రవారం బీజేపి నాగారం డివిజన్ బీజెవైఎం కన్వీనర్ మధుగౌడ్ ఆధ్వర్యంలో "ఫీజు బకాయిలు - బీజేపి లడాయి" కార్యక్రమాన్ని రాంపల్లిలోని కేజీఆర్ ఎంటెక్, ఫార్మసీ కళాశాలలో విద్యార్థులతో ఫీజు రీయింబర్స్ మెంట్,స్కాలర్‌షిప్‌ల విడుదల కోసం సంతకాల సేకరణ,మిస్డ్‌కాల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 40 లక్షలమంది విద్యార్థులకు సంబంధించిన 15 కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్ మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించాలంటే ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్,స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు చదువులకు దూరమవుతుండగా, తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం బిజేపి పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని,ప్రభుత్వం స్పందించేవరకు ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి "ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయండి"... "స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే చెల్లించండి"... "మా భవిష్యత్తును కాపాడండి"... " మా కుటుంబాలను అప్పుల భారం నుండి రక్షించండి" అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి మునుంగటి సురేష్,డివిజన్ అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్,మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్,ప్రధాన కార్యదర్శులు మామిడి జంగారెడ్డి,పోతంశెట్టి వెంక టేశ్వర్లు,సీనియర్ నాయకులు జమ్మల మధుగౌడ్,బిజేవైఎం నాయకులు రవిచంద్ర,శివ పాల్గొన్నారు.



నందిగామ హైస్కూల్ లో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసిన సర్పంచ్

## విద్యార్థులకు మొక్కలు పంపిణీ

**నందిగామ, ఆగస్ట 7, ప్రభాతవార్త :** పచ్చని చెట్లతోనే ఆరోగ్యం అని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పెంచాలని నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ పిలుపునిచ్చారు. నందిగామ హైస్కూల్ విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ము కృష్ణ మాట్లాడుతూ రాబోయే కాలంలో చెట్లపెంపకం లేకపోతే ప్రాణవాయువు దొరకని పరిస్థితి ఉంటుందన్నారు. ఇది మానవాళి మనుగడకు ఎంతో దోహదపడుతుందన్నారు. చెట్ల పెంపకం ద్వార వచ్చే గాలి ద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, బొమ్మ నర్సింలు, అగ్గి మమత సురేష్, శివ గళ్ళ ప్రవీణ్ , నాయకులు ఏఎంసి డైరెక్టర్ సి నర్సింలు,కేశమోని రామచంద్రి, నరేందర్ రెడ్డి, కృష్ణ, కుమ్మరి సురేష్ చేనగల్ల శ్రవణ్ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా

**నందిగామ, ఆగస్టు 7, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ఏకంగా నందిగామ గ్రామపంచాయతీలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన 9 వ వార్డు సభ్యురాలు కుమ్మరి శ్రీలత శుక్రవారం సర్పంచ్ కొమ్ము కృష్ణ సమక్షంలో కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. ఆమెతో పాటు కుమ్మరి సురేష్, టైలర్ సంపత్ కాంగ్రెస్ గూటికి చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, అగ్గి మమత సూరి, శివగళ్ల ప్రవీణ్,శివగళ్ల సురేష్, బొమ్మగల నర్సింలు, టైలర్ కృష్ణ, కుమ్మరి శ్రీలత సురేష్, నాయకులు పిట్టల రాములు, అగ్గి కృష్ణ,వంకాయల శ్రీనివాస్ రెడ్డి, ఎర్రగారి రమేష్ , కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**షాద్‌నగర్, ఆగస్టు 7, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పారిశుద్ధం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, రహదారుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై సభ్యులతో విస్తృతంగా చర్చించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తమ తమ వార్డుల అభివృద్ధి అవసరాలు, ప్రజా సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురాగా, వాటిపై చర్చించి అవసరమైన తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గర్భిణులకు హెచ్ఐవీ పరీక్షలు తప్పనిసరి

**షాద్‌నగర్, ఆగస్టు 7, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర హెచ్ఐవీ/ఎయిడ్స్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జయలక్ష్మి శుక్రవారం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ ను పరిశీలించి, హెచ్ఐవీ పరీక్షల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, రోగులకు అందిస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలో తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించాలని, పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచాలని సూచించారు. హెచ్ఐవీ సోకిన గర్భిణులకు సకాలంలో చికిత్స అందిస్తే తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు.ల్యాబ్‌లో జరుగుతున్న పరీక్షల విధానాన్ని పరిశీలించిన ఆమె, ల్యాబ్ టెక్నీషియన్లతో మాట్లాడి పరీక్షల నిర్వహణ, నివేదికల జారీ విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఐసీటీసీ కౌన్సిలర్ శ్యామ్ నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి, నెలవారీ కన్సాలిడేషన్ నివేదికలను కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు.

హెచ్ఐవీ పాజిటివ్ వ్యక్తులతో మాట్లాడిన డాక్టర్ జయలక్ష్మి, వారికి ప్రతి నెలా యాంటీ రెట్రోవైరల్ మందులు నిరంతరంగా అందేలా చూడాలని సూచించారు. అధిక ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి హెచ్ఐవీ పరీక్షలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, రంగారెడ్డి జిల్లా హెచ్ఐవీ ప్రోగ్రామ్ మేనేజర్ నరేందర్, సూపర్‌వైజర్ రమేష్, ఐసీటీసీ కౌన్సిలర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎబివిపి నగర కార్యదర్శిగా చెన్నంచెట్టి మల్లేష్

**ఆమనగల్లు, ఆగస్టు7, ప్రభాతవార్త:** అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆమనగల్లు నగర కార్యదర్శిగా చెన్నంచెట్టి మల్లేశ్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఢిల్లీ బాను అధ్యక్షతన నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈమేరకు ఆమనగల్లు బీసీ కాలనీకి చెందిన చెన్నంచెట్టి మల్లేష్‌ను నగర కార్యదర్శిగా ఏకగ్రీవంగా నియమించారు. సంయుక్త కార్యదర్శులుగా ఏడవల్లి అంజి, అఖిల్ నాయక్, పవన్ నాయక్, ఉపాధ్యక్షులుగా సుమన్ నాయక్, సురేష్ నాయక్, మోహన్, మని, మరియు వివిధ విభాగం నాయకులుగా శ్రీరామ్, శ్రీశైలం, యశ్వంత్, శివ, హర్షిత్, శివ శంకర్, అర్వింద్, చరణ్, రాకేష్, సాయి, జశ్వంత్, బబ్లు, హర్ష వర్ధన్, లను ఎన్నుకున్నారు. ఈమేరకు నగర కార్యదర్శి చెన్నంచెట్టి మల్లేశ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాడుతామన్నారు. ఫోటోరైటప్.ఏజిఎల్4. ఐక్యత చిహ్నం ప్రదర్శిస్తున్న జిఎంపిఎస్ ప్రతినిధులు

## రెండో విడత గొర్రెల పంపిణీని వెంటనే ప్రారంభించాలి

**ఆమనగల్లు,ఆగస్టు7, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో రెండో విడత గొర్రెల పంపిణీని వెంటనే ప్రారంభించి పెంపకందారుల ఖాతాలో నగదు బదలీ ద్వారా ఆర్థిక సహాయం ప్రారంభించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం జిఎంపిఎస్ ఆమనగల్లు మండల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమీర్‌పేట మల్లేష్ హాజరై మాట్లాడారు. గొర్రెలు, మేకల పెంపకందారులు తరతరాలుగా తమ వృత్తిని కొనసాగిస్తూ సమాజానికి పోషకాహారాన్ని అందిస్తున్నప్పటికీ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లుగా సంఘం వారి హక్కుల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించి హక్కులను సాధించుకున్నట్లు ఆయన పునరుద్ఘటించారు.

జిల్లా నాయకులు కాస మల్లేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వంద రోజుల్లోనే గొర్రెల పంపిణీ చేపడతామని హామీ ఇచ్చిందని, అయితే రెండున్నరేళ్లు గడిచినా రెండో విడత పంపిణీ ప్రారంభించలేదని విమర్శించారు. వెంటనే నగదు బదిలీ విధానంలో గొర్రెల పంపిణీ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉదాసీనత వైఖరిని ఎండుగడుతూ ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆగస్టు 11న ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న చిన్లా మహాసభలను గొర్రెలు, మేకల పెంపకందారులు, గొల్ల, కురుమలు, సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు, కుల పెద్దలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

**ఆమనగల్లు మండల నూతన కమిటీ ఎన్నిక....**

గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ఆమనగల్లు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా నిట్ట నారాయణ, అధ్యక్షులుగా కావటి కొండల్, ఉపాధ్యక్షులుగా కట్ట పర్వతాలు, టి. సత్యం, ప్రధాన కార్యదర్శిగా నిట్ట కొండల్, సహాయ కార్యదర్శులుగా డి. నారయ్య, ఈదమయ్యలను ఎన్నుకున్నారు. కోశాధికారిగా జాజల కుమార్, సోషల్ మీడియా బాధ్యులుగా కడారి వెంకటేష్, బన్నె నరసింహ, కృష్ణ, కమిటీ సభ్యులుగా నరసింహ, శ్రీను, రాజేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జల్లెల పెంటయ్య, జిల్లా కమిటీ సభ్యులు టి. సత్యం, ఈదమయ్య, ముక్కెరీ కృష్ణయ్య, బర్ల వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## రాంపల్లిలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కీసర,ఆగస్టు7,ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమంలో సమైక్య రాష్ట్రమే మా నినాదం అని తెలంగాణ వద్దని ఉద్యమంలో పాల్గొనవద్దని పిలుపునిచ్చిన ఏపియుటిఎఫ్ ని వీడి తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా,నాటి ఉద్యమంలో ఉపాధ్యాయ లోకాన్ని ఏకం చేసే క్రమంలో ఆగస్టు7,2011 నాడు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియుటిఎఫ్) గా ఏర్పడి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ లక్ష్యాన్ని ముద్దాడి నేడు ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతూ 15 సంవత్సరాలు పూర్తి చేసుకుని 16ం వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా టియుటిఎఫ్ రాష్ట్ర శాఖ సహకారంతో ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని రాంపల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం కార్యాయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు పతాకావిష్కరణ చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పాటుపడాలని,ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించినప్పుడే సంఘం ఎదుగుతుందని జిల్లా శ్రేణులకు పిలుపునిచ్చారు.రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి 51 శాతంను వెంటనే ప్రకటించాలని,6 డిఏలను కూడా వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అద్యక్షులు అంబల్ల రాజు,గౌరవాధ్యక్షులు నూకల నర్సింగ్‌రావు,రాష్ట్ర మోహన్‌బాబు,మండల అధ్యక్షులు శివక్రిష్ణ,ప్రధాన కార్యదర్శి పెద్దోళ్ల శ్రీనివాస్,రాష్ట్రనాయకులు రాచకొండ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## విజయ హోమ్స్ ఫర్ ఎల్డర్‌కు ఐసియు పడకలు,వీల్ చైర్లను అందజేసిన హ్యుందాయ్

**కీసర,ఆగస్టు7,ప్రభాతవార్త:** సత్యసాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న విజయ హోమ్స్ ఫర్ ఎల్డర్‌కు హ్యుందాయ్ ఇండియా ఇన్స్ రెన్స్ బ్రోకింగ్ సంస్థ ప్రతినిధులు ఆధునిక ఐసియు పడకలు,వీల్ చైర్లను విరాళంగా అందజేశారు,శుక్రవారం గోధుమకుంట గ్రామంలోని విజయ హోమ్స్ ఫర్ ఎల్డర్‌లో ఉన్న వృద్దులకు హ్యుందాయ్ ఇండియా ఇన్స్ రెన్స్ బ్రోకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ జోనల్ రీజినల్ మేనేజర్ అమిత్ వాస్వని,హైదరాబాద్ రీజినల్ మేనేజర్ అరవింద్ చారి,శివలు వృద్దులకు అందజేశారు.అత్యాధునిక ఐసియు పడకలు దీర్ఘకాలిక వైద్య సంరక్షణ అవసరమయ్యే వృద్దులకు మరింత సౌకర్యవంతమైన,సురక్షిత సేవలను అందించడంలో సహాయపడుతున్నాయన్నారు.వీల్‌చైర్లు స్వతంత్రంగా జీవించేందుకు తోడ్పడతాయని వృద్దుల సంక్షేమం కోసం హ్యుందాయ్ ఇండియా ఇన్స్ రెన్స్ బ్రోకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అందించిన సహకారం గొప్పదని విజయ హోమ్స్ పర్ఎల్డర్ యాజమాన్యం అన్నారు.ఈ కార్యక్రమంలో సిఈఓ సమీర్ నందాని,డాక్టర్లు కెఎల్ నరసింహ్మారావు చంద్రశేఖర్,రామక్రిష్ణ,జయంతి తదితరులు పాల్గొన్నారు.

# అరబిందోలో విద్యార్థుల బోనాల సందడి



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న విద్యార్థులు

**ఆమనగల్లు, ఆగస్టు7, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని అరబిందో హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులు ఆషాడమాసం బోనాల వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బోనం కుండలను తలపై పెట్టుకుని పట్టణ వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో అమ్మవారి ప్రతిమను ప్రదర్శించి పూజలు నిర్వహించారు. పోతురాజు వేషధారణతోపాటు చిన్నారుల వస్త్రధారణ ఆకట్టుకుంది.వేడుకలకు విద్యార్థులు, ఉపాధ్యాయ బృందంతోపాటు తల్లిదండ్రులు హాజరైనారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నలబోలు సుధీర్‌రెడ్డి, ప్రేమకుమారి, ప్రిన్సిపాల్ నాగమణి, ఉపాధ్యాయ బృందం నరేశ్‌నేత, భాస్కర్‌గుప్త, నజీర్, రతీష్, శ్రీను, రాధ, సౌజన్య, సునిత, సౌమ్య, యామిని, శైలజ, ప్రేమలత, సంధ్య, నహేద, సింధు తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మలపల్లిలో పోచమ్మ బోనాలు

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 7,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో శుక్రవారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పోతురాజులతో ఊరెగింపు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరెగింపుగా వెళ్లి అమ్మవారి దేవాలయం చుట్టు ప్రదక్షణలు చేశారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని గ్రామ పెద్దలు అమ్మవారిని వేడుకున్నారు. వర్షాలు సకాలంలో కురిసి ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండేవిదంగ దీవించాని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



తుమ్మలపల్లి గ్రామంలో పోతురాజుల విన్యాసాలు

## వెలుగులే కాదు.. భద్రతకు భరోసా!

**గ్రామాలలో సొంత నిధులతో ఐమాక్స్ లైట్ ఏర్పాటు**

**కొత్తూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులు నింపడంతో పాటు ప్రజలకు భద్రత కల్పించడమే తన లక్ష్యమని మాజీ ఎంపీపీ పిన్నింటి హరిత మధుసూదన్ రెడ్డి అన్నారు. కొత్తూరు మండలం మల్లాపూర్ గ్రామ పరిధిలోని రెడ్డిపాలెంలో ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్‌ను మాజీ ఎంపీపీ పిన్నింటి హరిత మధుసూదన్ రెడ్డి ప్రారంభిం చారు. ప్రజా అవసరాలను గుర్తించి సొంత నిధులతో మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రివేళల్లో వెలుతురు కొరతతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వెలుతురు ఉంటే రాకపోకలకు సౌకర్యం మాత్రమే కాదు.. ప్రజలకు భద్రతపై నమ్మకం కూడా పెరుగుతుంది అని ఆయన పేర్కొన్నారు. రెడ్డిపాలెంతో పాటు కొత్తూరు మండలంలోని అవసరమైన పలు గ్రామాల్లో కూడా తన సొంత నిధులతో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ పవిత్ర జయందర్ రెడ్డి. జోజి రెడ్డి,. సుజనమ్మ, గ్రామ పెద్దలు మ(రెడ్డి, షోర్ రెడ్డి, రాఫెల్ రెడ్డి. పాపి రెడ్డి. దయంద్ రెడ్డి. భారత్ రెడ్డి. చిర్ర రాజు, సుధాకర్, అయినమ్మ, సిస్టర్ శాంతి, అంతోని రెడ్డి, ధోరణిశ్ రెడ్డి, రాయప్ రెడ్డి, కృష్ణ కుమార్, బాల్ రెడ్డి, అయినా రెడ్డి, కీర్తి రెడ్డి, బోకుల రాజు, బాల్శోర్ రెడ్డి, పాపిరెడ్డి, విట్టల్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, దామోదర్ రెడ్డి, కృష్ణారెడ్డి, మహాత్మ రెడ్డి, పత్లావత్ మోహన్, శంకర్ నాయక్, రాములు, మరియు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా అవుటి శేఖర్

**దుద్యాల్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** దుద్యాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అవుటి శేఖర్‌ను జిల్లా కాంగ్రెస్ కమిటీ రెండోసారి నియమించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతి రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ధారాసింగ్‌తో పాటు తనను రెండవసారి మండల పార్టీ అధ్యక్షునిగా నియమించుటకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, మండల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మండలంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ఈర్లపల్లి భూసేకరణ ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తి



బందోబస్తు మధ్య సర్వే నిర్వహిస్తున్న అధికారులు

**దుద్యాల్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** దుద్యాల్ మండల పరిధిలోని ఈర్లపల్లి రెవెన్యూ గ్రామంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు చేపట్టనున్న 362 ఎకరాల 29 గుంటల భూసేకరణలో ఎంజాయ్‌మెంట్ సర్వే విజయవంతంగా పూర్తి అయింది. గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు భారీ పోలీసు బందోబస్తు మధ్య నాలుగు ప్రత్యేక సర్వే బృందాలతో అధికారులు క్షేత్రస్థాయిలో కొలతలు నిర్వహించారు. తొలి రోజు సర్వే నంబర్-88లోని 213 ఎకరాల అసైన్డ్ భూమికి, రెండో రోజు 149 ఎకరాల 29 గుంటల పట్టా భూమికి ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించి మొత్తం 362.29 ఎకరాల సర్వేను పూర్తి చేశారు.

రైతులు స్వచ్ఛందంగా హాజరై తమ భూముల హద్దులను చూపించి అధికారులకు సహకరించినట్లు దుద్యాల్ తహసీల్దార్ కిషన్ తెలిపారు. సర్వేను వేగవంతంగా పూర్తిచేసేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి, ప్రతి బృందానికి ఒక తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. వికారాబాద్, తాండూర్, పూడూర్, మోమిన్‌పేట్ తహసీల్దార్లు తమ తమ బృందాలకు నాయకత్వం వహించారు. సర్వేలో ఉప తహసీల్దార్ శివకుమార్, ఆర్ఐ నవీన్‌కుమార్, సర్వేయర్లు, జీపీఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. అధికారులు, పోలీసుల సమన్వయం, రైతుల సహకారంతో సర్వే పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు.

## వాము పంటలకు రైతులకు సబ్సిడి

**జిల్లా ఉద్యానవన అధికారి సత్తార్**

**దోమ,ఆగస్టు 7, ప్రభాతవార్త:** వాము పంటలు పండించే రైతులకు ప్రభుత్వం సబ్సిడి ఇస్తుందని వికారాబాద్‌జిల్లా ఉద్యానవన,పట్టు పరిశ్రమ అధికారి ఎంఏ సత్తార్ తెలిపారు. ఈ సందర్భముగ ఆయన మాట్లాడుతూ వాము ఒక ముఖ్యమైన ఔషదము,సుగంధద్రవ్య పంట అని ఈ వామును ఔషద పరిశ్రమలు,మసాలాలు,ఆహార తయారి రంగములో సంవత్సరము పొడువునా వాడుతారని అన్నారు. తక్కువ పెట్టుబడి తక్కువ నీటిఅవసరము,స్వల్ప వ్యవదిలో 120.150 రోజుల మద్య పంట కోతకు వస్తుందని తెలిపారు. పండిన పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని అన్నారు. సమీకృత ఉద్యాన మిషన్‌పథకం ద్వారా ఎకరం వాము పంట సాగు చెసె రైతులకు ప్రభుత్వం ద్వారా 8000 వేలు ఆర్థిక సహాయం 5 ఎకరాల వరకు అందించడముజరుగుతుందని అన్నారు. గతంలో లబ్ది పొందిన రైతులు అనర్హులు అనికొత్తగా ఈ సంవత్సరము దరఖాస్తు చేసుకున్న రైతులకు సబ్సిడి ఇవ్వడం జరుగుతందని తెలిపారు. రైతులు సమీప వ్యవసాయ కార్యాలయములో దరఖాస్తు చేసుకోవాలని పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకుఖాతా, పాస్‌పోటొ ద్వారా జిరాక్సులతోమండల ఉద్యానవన అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

## విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

**-- తాండూరు డిఎస్పీ నర్సింగ్ యాదయ్య**

**తాండూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త :** విద్యార్థులు చిన్నప్పటి నుంచి చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని తాండూరు డిఎస్పీ నర్సింగ్ యాదయ్య అన్నారు. తాండూరు పట్టణం పోట్లిమహారాజ్ ఆలయంలోని క్రిష్ణవేణి కాన్సెప్ట్ పాఠశాలలో వివిధ విభాగాలలో విద్యార్థి సంఘం నాయకులను ఎన్నుకునేందుకు ఇటీవల పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. పాఠశాలలో సాంస్కృతిక విభాగం, క్రీడలు, క్రమశిక్షణ, స్వచ్ఛత తదితర విభాగాలలో నైపుణ్యం పెంచేందుకు మాక్ ఎలక్షన్ నిర్వహించి విద్యార్థి నాయకులను ఎన్నుకున్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థి నాయకులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎస్పీ నర్సింగ్ యాదయ్య హాజరయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్‌తో పాటు డైరెక్టర్లు మల్లెపల్లి వెంకటేశం, సతీష్, మల్లేశం తదితరులు పాల్గోని విద్యార్థి నాయకులచే ప్రమాణ స్వీకారం చేయించారు. విద్యార్థులకు డిఎస్పీ చేతుల మీదుగా గుర్తింపు కార్డులను అందజేశారు. పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం వల్ల విద్యార్థులకు ఓటు హక్కు వినియోగించుకోవడం పట్ల అవగాహన పెరుగుతుందని, చదువుతో పాటు, క్రమశిక్షణ, నాయకత్వం, ప్రశ్నించే తత్వం ఏర్పడుతుందని, వారిలో భయం తొలిగిపోతుందని అన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులను అభినందిస్తూ.. నాయకత్వం అంటే ఒకరి శక్తిని ఆస్వాదించడం కాదని, అది ఇతరులను శక్తివంతం చేసే సాధనమని సూచించారు. తోటి విద్యార్థుల అభ్యున్నతి, ఎదుగుదల తోపాటు నిజాయితీ, విశ్వాసంతో ఉండాలని తెలిపారు.

## విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి

**ఘట్‌కేసర్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ఇంజినీరింగ్ విద్యలో అకడమిక్ పరిజ్ఞానంతో పాటు సాంకేతిక నైపుణ్యాలు, ఆవిష్కరణలు, పరిశోధన, కమ్యూనికేషన్ స్కిల్స్, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని జెఎన్‌టీయూహెచ్ రెక్టార్-ఎస్.వి.యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డా.ఎ.దామోదరం సూచించారు. ఎంఎంపి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కేపీఆర్ఐటీ)లో నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సమారంభ్-2026 ఒరియంటేషన్ డే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# నా బడికి సేవచేయడం అదృష్టం : అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి



భరత్‌తేజకు బహుమతి అందజేస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 7,(ప్రభాతవార్త):** నేను చదువుకున్న పాఠశాలకు నేను సేవలు చేసే అవకాశం వచ్చినందుకు నా అదృష్టంగా భావిస్తున్నానని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి మొదటి స్థానం సాధించిన భరత్‌తేజ అనే విద్యార్థికి బహుమతి ప్రధానం చేశారు. గత కొన్ని రోజుల కిందట పాఠశాలకు వచ్చిన ఆయన పాఠశాలకు లక్షా రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ లక్ష రూపాయలను బ్యాంకులో డిపాజిట్ చేసి ప్రతి సంవత్సరం వచ్చిన వడ్డీ డబ్బులను మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు ఇవ్వాలని తెలిపారు. ప్రస్తుత సంవత్సరం మొదటి స్థానం సాధించిన భరత్‌తేజకు వడ్డీ డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను పాఠశాలలో చదివే సమయంలో ఎంతో పట్టుదలతో చదివానని తెలిపారు. నేను అనకున్న అన్ని స్థానాలు చేదించానని ఆయన పెర్కొన్నారు. ఉపధ్యాయుడిగా జీవితాన్ని మొదలు పెట్టి ఆర్‌డిఓ, డిగ్రి లెక్చరర్ ఆతరువాత ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా విధులు కొనసాగిస్తున్నాని ఆయన పెర్కొన్నారు. మనిషి పట్టుదలతో చదివితే సాదించలేని ఏమి ఉండదని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థి తాము అనుకున్న లక్షాలు చేదించాలని ఆయన పెర్కోన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా అందుతుందని ఆయన తెలిపారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటుందని ఆయన పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దారు జగదీశ్వర్, గ్రామ సర్పంచ్ సోనిశేఖర్, ఉప సర్పంచ్ బాల్‌రాజు,ఉపాధ్యాయులు సునీత, కృష్ణ, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులపై డిసిపి సమీక్ష



సమావేశంలో ఎస్‌హెచ్‌ఓలకు పలు సూచనలు చేస్తున్న డిసిపి కె. నారాయణ రెడ్డి

**మహేశ్వరం, ఆగస్టు 7,ప్రభాతవార్త :** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం డిసిపి కార్యాలయంలో శుక్రవారం డిసిపి కె. నారాయణ రెడ్డి ఐపీఎస్ అధ్యక్షతన నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులు, ఛేదించాల్సిన (యూఐ) కేసులు, ఎస్సి/ఎస్టి, పోక్సో, ఎన్‌డిపిఎస్, పిడి యాక్ట్ కేసులు, చార్జ్‌షీట్ల దాఖలు, రౌడీ షీటర్ల పర్యవేక్షణ, సిసిటివి కవరేజ్, సిడిఆర్ విశ్లేషణ, సైబర్ నేరాల దర్యాప్తుపై సమీక్షించారు. పెండింగ్ కేసులను వేగంగా పూర్తి చేసి, సకాలంలో చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని, అలవాటైన నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగించాలని, సిసిటివి వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, విజిబుల్ పోలీసింగ్‌ను సమర్థంగా అమలు చేస్తూ శాంతిభద్రతలను కట్టుదిట్టంగా నిర్వహించాలని డిసిపి అధికారులను ఆదేశించారు. కేసుల ఛేదన శాతాన్ని పెంచేందుకు వృత్తిపరమైన, ఫలితాల ఆధారిత దర్యాప్తు చేపట్టాలని సూచించారు. సమావేశంలో మహేశ్వరం ఏసీపీ ఎస్. జానకిరెడ్డి, మహేశ్వరం జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

## గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని జూలపల్లి గ్రామానికి చెందిన నక్క తిరుపతి అనే వ్యక్తి ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. శుక్రవారం నాడు టిఆర్ఎస్ నాయకులు గౌత రెడ్డి విజయ్ కుమార్ రెడ్డి అతనిపరామర్శించారు. ఇటీవల తిరుపతి ప్రమాదవశాత్తు గోడ పైనుండి కిందపడి కాలు విరిగి పోవడం జరిగింది. శుక్రవారం నాడు అతని పరామర్శించి అతని చికిత్స నిమిత్తం వ్యక్తిగతంగా రూ.5వేలు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.5వేలు చొప్పున మొత్తం రూ.10వేలు, గాయపడ్డ వ్యక్తికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు గౌతంరెడ్డి విజయ్ కుమార్ రెడ్డి గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పల్లెల్లో అభివృద్ధి

**తలకొండపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే గ్రామీణ ప్రాంతాల్లోని పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామం నుంచి లింగరావుపల్లి వెళ్లే రోడ్డుకు బిటి రోడ్డు నిర్మించుటకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో 1.5 కోట్ల రూపాయలు మంజూరు కావడం జరిగిందని, గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని ఆయన అన్నారు. ఎమ్మెల్యే సహకారంతో మండలంలోని అనేక గ్రామాల్లో విరివిగా సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీలు, బీటీ రోడ్లుకు అధిక నిధులు మంజూరు అయ్యాయని, లింగరావుపల్లి గ్రామంలో మిగిలిపోయిన అప్పన్న చెరువు నుండి లింగరావుపల్లి గ్రామం వరకు వెళ్లే రోడ్డు 1.4 కిలోమీటర్ల రోడ్డుకు 1.5 కోట్లు మంజూరుకావడం అభినందనీయమన్నారు. ఆయన వెంట ఉపసర్పంచ్ బూత్కూరు వెంకటరెడ్డి బాలిరెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ఎలమందరెడ్డి రాజేష్ ప్రదీప్ రెడ్డి ఆయన వెంట ఉపసర్పంచ్ బూత్కూరు వెంకటరెడ్డి బాలిరెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ఎలమందరెడ్డి రాజేష్ ప్రదీప్ రెడ్డి ఉన్నారు.

## వెల్స్పన్ ఆధ్వర్యంలో షాబాద్‌లో మొక్కల పంపిణీ

**షాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం లక్ష్యంగా వెల్స్పన్ ఫౌండేషన్ చేపట్టిన వెల్ ప్రకృతి కార్యక్రమంలో భాగంగా షాబాద్ మండలం లో మొక్కల పంపిణీ చేపట్టారు. మండలంలోని 18 గ్రామాలు, ఆరు పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారం 221 మంది రైతులు, గ్రామస్థులు, విద్యా ర్థులు, పాఠశాలల ప్రతినిధులకు మొత్తం 2,070 మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా వెల్స్పన్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెల్స్పన్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ పవన్ కుమార్, మండల కోఆర్డినేటర్ రమేష్, నర్సరీ ఇన్‌చార్జ్ దామోదర్, గ్రామాల సర్పంచులు, రైతులు, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రైతు బిడ్డకు దక్కిన అరుదైన గౌరవం

**నందిగామ పిఏసిఎస్ చైర్మన్‌గా కుందారం వెంకట్ రెడ్డి**

**నందిగామ, ఆగస్టు 7, ప్రభాతవార్త :** నందిగామ సింగిల్ విండో చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందోనని ఎప్పుడు ఎప్పుడు అని ఎదురుచూస్తున్న అన్నదాతల సందేహానికి ముగింపు పలికారు. నందిగామ సింగిల్ విండో చైర్మన్‌గా రైతుబిడ్డ, సీనియర్ డైరెక్టర్ కుందారం వెంకట్ రెడిని నియమించినట్లు ఆ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార స్వామి గౌడ్‌అధికారికంగా ప్రకటించారు. రైతుబిడ్డగా వ్యవసాయరంగంలో అపారమైన అనుభవమున్న కుందారం వెంకట్ రెడ్డి రెండు పర్యాయాలు సింగిల్ విండో డైరెక్టర్‌గా ఎన్నికై రైతుల పక్షపాతిగా రైతు పక్షాన పోరాడారు. రాజకీయ కుటుంబ నేపథ్యం ఉండి, రైతన్నల సమస్యలపై ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరించిన రైతునేతగా ఆయనకున్న అనుభవం ఆయనను సింగిల్ విండో చైర్మన్ పదవి వరించిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనకు చైర్మన్ పదవి కట్టబెట్టి, తనకు అన్నదాతలకు సేవ చేసే భాగ్యం కల్పించిన ఎమ్మెల్యేకి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార స్వామి గౌడ్, మాజీ అధ్యక్షుడు జంగ నరసింహులు, నందిగామ సర్పంచ్ , జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, మండల ఉత్తమ రైతు అవార్డు గ్రహీత జిల్లెల్ల బాల్ రెడ్డికు మండల కాంగ్రెస్ శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ బోనాల పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

## కొడంగల్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఏర్పాటు

**కొడంగల్,ఆగష్టు 7,ప్రభాతవార్త:** తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి కీలకమైన అడుగు పడింది. కొడంగల్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దారాసింగ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొడంగల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మండల పరిధిలోని పెద్దనందిగామ మాజీ సర్పంచ్ కనకంటి సంజీవరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కొడంగల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కొడంగల్ నయ్యూంను మరోసారి కొనసాగిస్తూ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఆ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించగల నాయకుడిగా కనకంటి సంజీవరెడ్డిని ఎంపిక చేయడం ద్వారా పార్టీకి మరింత బలం చేకూరుతుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంజీవరెడ్డి, కొడంగల్ నయ్యూం మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా పార్టీ అధ్యక్షులు ధారాసింగ్, మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. తమకు అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తామని, పార్టీని గ్రామస్ధాయిలో మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.

## పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టం

**తలకొండపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త:** చిన్నారి పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టకరమని పడకల్ సర్పంచి దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు శుక్రవారం నాడు పడకల్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లి శిశువుకు తొలి ఆరు మాసాలు తల్లిపాలు మాత్రమే అందించాలని తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి, అంగన్వాడి కార్యకర్తలు అంతుల్ బేగం సమంత గ్రామ కార్యదర్శి రమాదేవి వార్డు సభ్యులు వాజిద్ గట్టుపల్లి వసంత తల్లులు గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలి

**ఘట్‌కేసర్, ఆగష్టు 7, ప్రభాతవార్త:** అత్యవసర సేవలైన 112 మహిళల భద్రతకు సంబంధించిన సహాయ సేవలను పోలీస్‌స్టేషన్‌లో వినియోగించుకోవాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌లోని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ హాలులో శుక్రవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో "సహచరి" కార్యక్రమం నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతీ ఆదేశాల మేరకు మహిళల భద్రత, సాధికారత, సామాజిక అవగాహన, పోలీస్-ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో "సహచరి" కార్యక్రమం ఏర్పాటు చేశారు. మెప్మా, సెర్ప్ సంస్థలకు చెందిన రిసోర్స్ పర్సన్స్, స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఎస్ఐలు శేఖర్, హీనాలు, ఘటకేసర్ ట్రాఫిక్ ఎఎస్ఐ తిరుపతిరెడ్డి, ఉప్పల్ మహిళా పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ స్వర్ణలత, సిడిఈడబ్ల్యు కౌన్సిలర్ అర్చన పాల్గొని మహిళల భద్రత కోసం తెలంగాణ పోలీస్ శాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, మహిళలపై జరిగే నేరాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, గృహ హింస, వేధింపులు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. మహిళలు ఎటువంటి సమస్యలు ఎదురైనా భయపడకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను అత్యవసర సేవలైన 112, మహిళల భద్రతకు సంబంధించిన సహాయ సేవలను సంప్రదించాలని సూచించారు. మెప్మా, సెర్ప్ రిసోర్స్‌పర్సన్స్ కూడా మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి అవకాశాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల వినియోగం మరియు సామాజిక బాధ్యతలపై వివరించారు. అనంతరం సహచరి కార్యక్రమంలో చేపట్టే అంశాలపై అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, మెప్మా, సెర్ప్ రిసోర్స్ పర్సన్స్, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

**ఘట్‌కేసర్, ఆగష్టు 7, ప్రభాతవార్త:** రైలుకు ఎదురుగా వచ్చి ఒగుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జిఆర్‌పి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శుక్రవారం మధ్యాహ్నం సమయంలో భువనేశ్వర్ నుండి ముంబై వెళుతున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ వైపు వస్తుండగా చర్లపల్లి-ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య ఒక గుర్తుతెలియని వ్యక్తి (35) రైలుకి ఎదురుగా రాగా రైలు ఢీకొట్టగా మృతి చెందాడని లోకో పైలట్ సికింద్రాబాద్ జిఆర్‌పి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు రైల్వేపోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలఉ సేకరించారు. మృతునికి సంబంధించి ఏలాంటి ఆధారాలు లభించకపోవడంతో శవాన్ని గాంధీ హాస్పిటల్‌కు తరలించి పీఎంఈ నిర్వహించి వారికి సంబంధించిన రక్త బంధువులకు సమాచారము తెలిస్తే వారికి అప్పగిస్తామని, లేకుంటే జిహెచ్ఎంసి వారికి అప్పగించి వారి నుండి తగిన రసీదు పొందుతామని, మృతుని ఫోటో ద్వారా ఆచూకి లభిస్తే ఆర్పీఎస్ సికింద్రాబాద్ రైల్వే పోలీస్ వారికి సంప్రదించాలని రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్ ఫోన్ 87126 58581, 9392745915లకు సంప్రదించగలరని ఆర్పీఎస్ పోలీసులు సూచించారు.

## శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సర్చ్ : డిసిపి

**శంషాబాద్, ఆగష్టు7,ప్రభాతవార్త :** శాంతిభద్రతలను పరిరక్షించేందుకే కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్నామని శంషాబాద్ డిసిపి రాజేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓల్డ్ పీఎస్ ఏరియా, శివాజీ బస్తీ, ఎరుకల బస్తీ, అహ్మద్ నగర్, ఖాజీ గల్లీ ప్రాంతాల్లో ఎసిపి శ్రీకాంత్ గౌడ్‌తో కలిసి డిసిపి రాజేష్ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.



కార్డన్ సర్చ్‌లో పాల్గొన్న డిసిపి,ఎసిపి ,పోలీసు సిబ్బంది

తనిఖీల సందర్భంగా 8 మంది అనుమానితులను విచారించి ధృవీకరించగా, బయోమెట్రిక్ పరికరం ద్వారా 100 మందికి పైగా వ్యక్తులవివరాలను పరిశీలించారు. అలాగే 22 వాహనాలను తనిఖీ కోసం స్వాధీనం చేసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టారు. అదనంగా 2 ఎక్సైజ్ కేసులు నమోదు చేయడంతో పాటు అక్రమంగా డీజిల్ నిల్వ ఉంచినందుకు ఒక కేసు కూడా నమోదు చేశారు. ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం, నేరాలను అరికట్టడం, శాంతిభద్రతలను పరిరక్షించడం లక్ష్యంగా ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో జోనల్ స్టాఫ్, ట్రాఫిక్ స్టాఫ్, హెడ్‌క్వార్టర్స్ సిబ్బందితో కలిపి సుమారు 200 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బిజెపి అర్బన్ అధ్యక్షులుగా డి.గిరివర్ధన్‌రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగష్టు 7,ప్రభాతవార్త:**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బిజెపి అర్బన్ అధ్యక్షులుగా డి.గిరివర్ధన్‌రెడ్డి (కుత్బుల్లాపూర్) నియమితులయ్యారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బిజెపి అర్బన్ అధ్యక్షులుగా డి.గిరివర్ధన్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ గౌతంరావు ఆయన నియమితులైనట్లు అధికారికంగా ప్రకటించారు. ఇప్పటివరకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బిజెపి అర్బన్ ఇన్‌చార్జి అధ్యక్షులుగా రాష్ట్ర బిజెపి నాయకులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి కొనసాగారు.

ఇకజిల్లా బిజెపి అర్బన్ అధ్యక్షులుగా డి.గిరి వర్ధన్‌రెడ్డి నియమితులు కావటంతో జిల్లాకు చెందిన బిజెపి శ్రేణులు పలువురు అభినందనలు తెలియజేశారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అర్బన్ ప్రాంతంలో బిజెపి మరింత బలపడుతుందని బిజెపి శ్రేణులు ఆశాభావంను వ్యక్తం చేశారు.

బిజెపి జిల్లా అర్బన్ అధ్యక్షులుగా నియమితులైన డి.గిరివర్ధన్‌రెడ్డిని డాక్టర్ ఎస్‌రావు నగర్ డివిజన్ బిజెపి నాయకులు కలిసి సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో బిజెపి నాయకులు సన్మానించారు.

ఈ కార్యక్రమం లో డాక్టర్ ఎఎస్‌రావు నగర్ డివిజన్ అధ్యక్షురాలు తుమ్మల సంధ్యానర్సిరెడ్డి, సీనియర్ నాయకులు అంబటి వెంకటాచలం, జీవిఎన్ రావు, ఏనుగు రాజిరెడ్డి, సందీప్‌చారి, సోమేశ్‌నాయుడు, దేవగౌడ్, నర్సిరెడ్డి, మురళి, సంతోష్, బిజెవైఎం నాయకులు నవీన్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

## సూచనలు పాటించాలి

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 7,(ప్రభాతవార్త):** గ్రామాల్లోని రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా తీసుకుని పాటించాలని శాస్త్రవేత్తలు రాజేశ్వర్‌రెడ్డి, భారతీలు అన్నారు. శుక్రవారం జిల్లెడు చౌదరి గూడ మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో క్షేత్ర పరిశీలన చేశారు. గ్రామంలో పత్తి,మొక్కజొన్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు శాస్త్రీయ సూచనలు చేశారు. గ్రామాల్లో పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించిన శాస్త్ర వేత్తలు పత్తిపంటలో అక్కడక్కడా జాసిడ్లు, త్రిప్స్, తెల్లదోమ వంటి రసం పీల్చే పురుగుల ప్రారంభఉధృతిని గమనించారు. అలాగే మొక్కజొన్నపంటలో పోషక యాజ మాన్యం, కలుపు నివారణ, పంటఆరోగ్యంపై రైతులకు అవ గాహన కల్పించారు. పత్తిపంటలో రసం పీల్చే పురుగుల ఉధృతిని నిరంతరం గమనించి, ఆర్థిక నష్ట స్థాయికి చేరుకున్నప్పుడు మాత్రమే థయామెథోక్సామ్ 25 డబ్లుజి, 0.2 గ్రా./లీటరు నీటికి, ఏసిఫేట్ 75ఎస్‌పి 1.5 గ్రా./ లీటరు నీటికి పిచికారీ చేయాలని సూచించారు. పంటల ఎదుగుదల మెరుగుపడేందుకు 19:19:19 నీటిలో కరిగే ఎరువును 10 గ్రా./లీటరు నీటికి కలిపి ఆకులపై పిచికారీ చేయాలన్నారు. అవసరమైన దశలో నానో డీఏపీ 2-4 మి.లీ./లీటరు , నానో యూరియా 2-4 మి.లీ./లీటరు మోతాదులో ఆకులపై పిచికారీ చేయడంద్వారా పోషకాల వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. మొక్క జొన్న పంటలో కలుపు మొక్కలను సకాలంలో తొలగించి, సమతుల్య పోషక యాజమాన్యాన్ని పాటించాలన్నారు. శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా పత్తి, మొక్కజొన్న పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేందర్‌రెడ్డి, అజాం పటేల్, చిలకమర్రి జంగయ్య, పాపయ్య, పిట్ట జంగయ్య, జోగు మాణిక్యారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఒసి అందజేత



ఎల్‌ఓసి అందజేస్తున్న నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 7,(ప్రభాతవార్త):** జిల్లెడ్ చౌదరి గూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామానికి చెందిన అశ్రఫ్ అలీకి ఆరోగ్యసమస్య నిమిత్తం ఉమ్మడి మహబూబ్నగర్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి రెండు లక్షల ఎల్ఓసిని మంజూరు చేయించినట్లు సర్పంచ్ సోని శేఖర్ తెలిపారు. శుక్రవారం అశ్రఫ్ ఆలీ కుటుంబ సభ్యులకు ఎల్ఓసిని అందజేశారు. ఈ సందర్భంగా అశ్రఫ్ ఆలీ కుటుంబ సభ్యులు నవీన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాలరాజ్, మాజి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కోనేరి నర్సింగ్ రావు, మాజీ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు మీదిగడ్డ బాబురావు, వార్డు సభ్యులు నాజీలిన్ రియాజ్, గంగ నరేష్, సయ్యద్ గౌస్, ముంతాజ్ అలీ, బోలా రాజు, .అరివింద్ రెడ్డి, నాగయ్య, శేఖర్, నవీన్ పటేల్,ఎండీ.లైక్ హాయ్ కార్తీక్,హైమద్, హాజర్, జాహిర్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన డిఇఒ

**జిల్లెడుచౌదరిగూడ, ఆగస్టు 7,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడి పాఠశాల స్థితిగతులు తెలుసుకున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

## బోగారంలో బ్యాటరీ దొంగలు అరెస్ట్

**కీసర,ఆగస్టు7,ప్రభాతవార్త:** కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోగారంలో లారీబ్యాటరీలను దొంగతనం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను స్థానికులు అప్రమత్తమై రెడ్‌హ్యాండెడ్‌గా శుక్రవారం పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోగారం గ్రామ పరిసరాల్లో నిలిపి ఉంచిన వాహనాల నుంచి బ్యాటరీలను చోరీ చేసేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు అనుమానితులను కొందరు యువకులు,లారీ యజమానులు గమనించి వెంటనే వారిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానంగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

## ధారూర్ మండలంలో పశువుల చోరీ

**....ఒకే రోజు నాలుగు మూగజీవాల అపహరణ**

**ధారూర్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రెండు గ్రామాల్లో గురువారం రాత్రి దొంగలు పశువుల చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో మొత్తం నాలుగు మూగజీవాలు అపహరణకు గురయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అల్లిపూర్ గ్రామానికి చెందిన శ్రీశైలమ్మ గౌడ్ వద్ద నుంచి రెండు ఆవులను, కావలి సాయిలు దగ్గర నుంచి ఒక ఆవును దుండగులు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా, కెరెల్లి గ్రామానికి చెందిన కొంకలి రాజుకు చెందిన ఒక లేగదూడను సైతం రాత్రి సమయంలో అపహరించుకెళ్లారు. ఒకే రాత్రి రెండు గ్రామాల్లో పశువులు చోరీకి గురికావడంతో స్థానిక రైతులు, పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సున్నం రాఘవేందర్ తెలిపారు. పరారీలో ఉన్న దొంగల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు వెల్లడించారు.

**ఉపాధ్యాయ విద్యా రంగ సమస్యలపై**

## యు. ఎస్. పి. సి పోరుబాట

**తలకొండపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ పోరుబాట మొదలు పెడుతుందని బొడ్డుపల్లిరాములయ్య అన్నారు. విద్యా రంగ సమస్యలపై నేటినుంచి పాఠశాలల్లో నిరసనలతో ప్రారంభమై ఆగస్టు 12, 13 వ తేదీలలో మండల కేంద్రాల్లో మెమోరాండంలు, 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేస్తామన్నారు. పీఆర్సీ ప్రకటించేదాక నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని హెచ్చరించారు. ఆగస్టు 21 నుంచి 26 వరకు రాష్ట్ర, జిల్లాబృందాల పర్యటన, జిల్లాకేంద్రాల్లో ప్రెస్ మీట్లు, ఆగస్టు 29న ఇందిరా పార్క్‌లో మహా ధర్నా చేపడతామన్నారు.